# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :257 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 23-12-2025 | పేజీలు:4 వెల: 2.00


## మద్యం మత్తులో వ్యక్తి వీరంగం..

నిజామాబాద్, డిసెంబర్ 22 : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి రోడ్డుపై వీరంగం సృష్టించాడు. విధినిర్వహణలో ఉన్న ట్రాఫిక్ పోలీసుల పై తిరగబడి భౌతిక దాడులకు పాల్పడ్డాడు. నిజామాబాద్ ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఆర్ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ సిబ్బందితో కలిసి నగరంలోని కంటేశ్వర్ రైల్వే కమాన్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. అదే సమయంలో అటువైపుగా వచ్చిన ఓ కారును నిలిపి ట్రాఫిక్ పోలీసులు అందులో ఉన్న వ్యక్తికి బ్రీతింగ్ ఎనలైజర్ తో పరీక్షలు నిర్వహించారు. దీంతో సదరు వ్యక్తి డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ సీఐని నెట్టివేయడంతో పాటు ఆర్ఎస్ఐపై భౌతిక దాడికి పాల్పడినట్టు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు. దీంతో సదరు వ్యక్తి మద్య మత్తులో ట్రాఫిక్ సిబ్బంది పై తిరగబడి విధులకు ఆటంకం కలిగించాడని మూడో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆర్ఎస్ఐ ఫిర్యాదు చేశారు. నెల కల్ రోడ్డు ప్రాంతానికి చెందిన పిట్ల సాయిలు అనే సదరు వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు మూడో టౌన్ ఇన్చార్జ్ ఎస్ఐ నారాయణ తెలిపారు.

## ఎన్నికలప్పుడే రాజకీయాలు.. మిగతా టైమ్‌లో ఐక్యతతో అభివృద్ధి చేసుకోవాలి



సూర్యాపేట: తెలంగాణ గ్రామపంచాయతీలు యావత్ దేశానికే ఆదర్శమని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తెలిపారు. ఆ ఘనత ముమ్మాటికీ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దే అని అన్నారు. గత ఉమ్మడి పాలనలో ఏమాత్రం అభివృద్ధికి నోచుకోని గ్రామాలు.. పోరాడి సాధించుకున్న తెలంగాణలో అన్ని గ్రామాల రూప రేఖలు మార్చుకున్నామని గుర్తుచేశారు. సూర్యాపేట నియోజకవర్గంలోని ఆత్మకూర్ (ఎస్) మండలం నెమ్మికల్ గ్రామ సర్పంచ్ ప్రమాణస్వీకారం వేడుకకు జగదీశ్‌రెడ్డి హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం నూతన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లను సత్కరించారు. ఈ సందరరేగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో పదేండ్లు ఎనలేని అభివృద్ధి సాధించుకున్నామని తెలిపారు. దేశంలోనే అభివృద్ధి చెందిన గ్రామాల్లో మొదటి పది తెలంగాణ గ్రామాలే ఉన్నాయని.. మొదటి 20 గ్రామాల వారీగా చూసిన 19 స్థానాలను తెలంగాణ గ్రామాలే కైవసం చేసుకున్నాయని పేర్కొన్నారు. అంతటి ఘన చరిత్ర కేసీఆర్ పాలనకే సాధ్యమైందని పేర్కొన్నారు. పల్లె ప్రక ృతి వనాలతో పచ్చదనం పెంచుకున్నామని.. వాటి సంరక్షణకై ప్రతి గ్రామంలో వాటర్ ట్యాంకర్ ఏర్పాటు చేసుకున్నామని జగదీశ్ రెడ్డి తెలిపారు. మిషన్ భగీరథ ట్యాంకుల ద్వారా మంచినీటి సమస్య తీర్చామని, గ్రామానికో ట్రాక్టర్, వైకుంఠధామాలు, రోడ్లు ఇలా గ్రామానికి కావలసిన సౌకర్యాలు అన్ని పూర్తి చేసుకున్నామని పేర్కొన్నారు. ఇన్ని సౌకర్యాలు ఉన్న గ్రామాలు దేశంలోనే మరెక్కడా లేవని.. అందుకే మన తెలంగాణ గ్రామాలు అభివ ృద్ధిలో నెంబర్ వన్ గా నిలిచాయని స్పష్టం చేశారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు తప్ప.. గ్రామాలను ఐక్యతతో అభివ ృద్ధి చేసుకుందామని జగదీశ్ రెడ్డి సూచించారు. ఇదే కేసీఆర్ నేర్పిన అభివృద్ధి మంత్రం.. ఈ మార్గంలోనే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. అంతా ఐక్యతతో కలిసి గ్రామాలను మరింత అభివృద్ధి పథంలో నడపాలని పిలుపునిచ్చారు.

## జగన్‌కు కేసీఆర్ గిఫ్ట్.. వైసీపీ నేతలు ఫుల్ ఎంజాయ్...

హైదరాబాద్,జగన్ పుట్టినరోజు మీడియా ముందుకొచ్చారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. మీడియాకు కావల్సినంత మసాలా ఇచ్చారు. సీఎం చంద్రబాబుపై కేసీఆర్ పేల్చిన డైలాగులపై వైసీపీ నేతలు ఫుల్ ఎంజాయ్ చేశారు. అంతేకాదు అధినేత హ్యాపీగా ఫీలయ్యారని అంటున్నారు ఆ పార్టీలోకి కొందరు నేతలు. కేసీఆర్ మీడియా సమావేశాన్ని చివరివరకు జగన్ తిలకించినట్టు తెలుస్తోంది.

కేసీఆర్ సమావేశంపై వైసీపీ నేతలు ఫుల్ ఎంజాయ్

దాదాపు రెండేళ్లు తర్వాత మీడియా ముందుకొచ్చారు మాజీ సీఎం కేసీఆర్. ఎప్పటి మాదిరిగా అధికార ప్రభుత్వంపై దుమ్మెత్తిపోశారు. కేవలం రెండు లేదా మూడు అంశాల గురించి ప్రధానంగా మాట్లాడారు. రెండేళ్లు సమయం ఇవ్వాలని ఆలోచించి ఇప్పుడు వచ్చానని చెప్పారు. కేవలం తెలంగాణ రాజకీయాల గురించి మాట్లాడితే ఆసక్తి ఉండదని భావించిన కేసీఆర్.. చంద్రబాబు గురించి ప్రస్తావించారు. అందులో ఆనాటి పాలమూరు సమావేశం, 13 కోట్ల వ్యవహారం, 2014-19 మధ్య విశాఖ సమ్మిట్ గురించి తనదైన శైలిలో మాట్లాడి సమావేశాన్ని ముగించారు. చంద్రబాబు గురించి కేసీఆర్ మాట్లాడిన కొన్ని అంశాలపై వైసీపీ అధినేత హ్యాపీగా ఫీలయ్యారట.

చంద్రబాబు పేరు ప్రస్తావనపై తెలంగాణ టీడీపీ నేతలు ఆగ్రహం

ఒకవిధంగా చెప్పాలంటే వైసీపీ అధినేత జగన్ పుట్టిన రోజునాడు కేసీఆర్ ఈ విధంగా గిఫ్ట్ ఇచ్చారని కొందరు నేతలు అంటున్నారు. రెండేళ్లు తర్వాత కేసీఆర్ మీడియా ముందుకు రావడం, ఆయన చెప్పిన మాటలు ప్రజల్లోకి సూటిగా వెళ్లిపోయాయని అన్నారట. ఇకపై అదే ఒరవడి మనం కంటిన్యూ చేయాలని కొందరి నేతలతో రాత్రి జగన్ అన్నట్లు ఆ పార్టీ నుంచి ఓ ఫీలర్ బయటకువచ్చింది. దీనిపై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడారు. సీఎం చంద్రబాబు కోసం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు 100 శాతం కరెక్ట్ అని అన్నారు. కేసీఆర్ ఏనాడూ అబద్దాలు మాట్లాడలేదన్నారు. అందుకే ఆయన పెద్ద నేత అయ్యారని



అన్నారు. కేసీఆర్ వ్యాఖ్యలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వంలో ఉండి ప్రజల కోసం ఆలోచించాలని, కొడుకు-కుటుంబం కోసం కాదన్నారు. ఇక కేసీఆర్ ఎప్పుడు మాట్లాడినా, చంద్రబాబు పేరు లేకుండా మాట్లాడిన సందరరే లేదు. ఆయన పేరు ప్రస్తావించి జనాల దృష్టిని తనవైపు ఆకర్షించుకుంటారని అంటున్నారు. అయినా తెలంగాణ రాజకీయాలకు గురించి మాట్లాడాల్సిన కేసీఆర్, అక్కడ ఏమీ లేకపోవడంతో ఏపీ గురించి ప్రస్తావించారని అంటున్నారు తెలంగాణలోని టీడీపీ నేతలు. ఈ మధ్యకాలం ఏపీ-తెలంగాణ సీఎంలు ఒకే వేదికపై కనిపిస్తున్నారు. దాన్ని తట్టుకోలేక కేసీఆర్ ఆ విధంగా మాట్లాడారని అంటున్నారు. ఆ పార్టీకి స్టాండ్ లేకపోతే టీడీపీపై దుమ్మెత్తిపోస్తారని అంటున్నారు. అసలు బీఆర్ఎస్ పార్టీ ఉందా? టీఆర్ఎస్ పార్టీ ఉందా? అనేది క్లారిటీ లేకుండా కేసీఆర్ మాట్లాడారని అంటున్నారు. తెలంగాణను పదేళ్లు పాలించిన కేసీఆర్, ఏం చేశారని ప్రశ్నల మీద ప్రశ్నలు రైజ్ చేస్తున్నారు. మొత్తానికి కేసీఆర్ మాట్లాడిన మాటలపై ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది.

## బంగ్లాదేశ్‌లో హింస సర్వసాధారణమైంది..



ఢాకా, మన పొరుగు దేశం బంగ్లాదేశ్ మరోసారి భగ్గుమంది. ఇటీవల కాల్పుల్లో గాయపడి చికిత్స పొందుతున్న విద్యార్థి, తిరుగుబాటు నాయకుడు, భారత్ వ్యతిరేక వ్యాఖ్యలు చేసే షరీఫ్ ఉస్మాన్ హాది (32) మరణించడంతో ఆ దేశంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనకారులు గురు, శుక్రవారాల్లో దేశంలో పలుచోట్ల నిరసనలు చేపట్టడంతో హింస, విధ్వంసం చోటు చేసుకుంది. అల్లర్లలో ఒక హిందువు హత్యకు గురి కాగా, పలువురు నిరసనకారులు, పౌరులు గాయపడ్డారు. ప్రస్తుతం ఆ దేశంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజా ఉద్రిక్తతలపై ఆదేశ మాజీ ప్రధాని షేక్ హసీనా తాజాగా స్పందించారు. ఈ మేరకు యూనస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. బంగ్లాదేశ్‌లో హింస అనేది సాధారణ విషయంగా మారిందని.. దేశంలో హింసను నియంత్రించడంలో తాత్కాలిక ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ఓ వార్త సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో హసీనా మాట్లాడుతూ. 'ఉస్మాన్ బిన్ హాదీ హత్య అనంతరం ఢాకాలో నెలకొన్న హింస దేశాన్ని మరితం అస్థిరపరుస్తోంది. ఈ హత్య నా ప్రభుత్వాన్ని కూల్చివేసి, యూనస్ పాలనలో పెరిగిపోయిన అక్రమాన్ని ప్రతిబింబిస్తోంది. నన్ను బహిష్కరించినప్పటి నుంచి దేశంలో పరిస్థితి మరింత దిగజారింది. యూనస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బంగ్లాలో హింస పెరిగిపోయింది. హింసను ఆపడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. నిరంతర హింస బంగ్లాదేశ్‌ను అంతర్గతంగా అస్థిరపరుస్తోంది. పొరుగు దేశాలతో, ముఖ్యంగా భారతదేశంతో సంబంధాలను దెబ్బతీస్తోంది. ఈ గందరగోళాన్ని, మైనారిటీలపై జరుగుతున్న వేధింపులను, మనం కలిసి నిర్మించిన వ్యవస్థల క్షీణతను భారత్?చూస్తోంది' అని హసీనా వ్యాఖ్యానించారు. యూనస్ ప్రభుత్వం ఇస్లామిక్ తీవ్రవాద శక్తులకు అవకాశం కల్పిస్తోందని షేక్ హసీనా తీవ్ర ఆరోపణలు చేశారు. తీవ్రవాదులను కేబినెట్‌లో చేర్చుకోవడం, జైళ్లలో ఉన్న ఉగ్రవాదులను విడుదల చేయడం వంటి చర్యలను ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. యూనస్‌కు పాలనా అనుభవం లేదంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## మహిళలకు జీరో టికెట్ బదులు ఫ్రీ బస్ పాస్ కార్డు.. ఆర్టీసీ జేఏసీ హర్షం

హైదరాబాద్, మహాలక్ష్మీ పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు జీరో టికెట్ బదులు ఉచిత బస్ పాస్ కార్డు ఇవ్వాలని నిర?యించడం పట్ల ఆర్టీసీ జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఆర్టీసీ సమీక్ష సమావేశంలో ఈ నిర?యం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపింది. మహాలక్ష్మీ పథకం అమలులో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరగడంతో మహిళలకు జీరో టికెట్ జారీ చేసే సమయంలో కండక్టర్లు కొంత గందరగోళానికి గురవుతున్నారని.. పురుషులకు కూడా పొరపాటున జీరో టికెట్లు ఇస్తుండటంతో వారిని ఉద్యోగంలో నుంచి తీసేస్తున్నారని ఆర్టీసీ జేఏసీ తెలిపింది. ఈ క్రమంలోనే జీరో టికెట్ బదులు ఉచిత బస్ పాస్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశామని గుర్తుచేసింది. దీనిపై ప్రభుత్వం, ఆర్టీసీ



యాజమాన్యాల దృష్టికి జేఏసీ తీసుకెళ్లిందని తెలిపింది. మే 6న రవాణా శాఖ మంత్రితో జరిగిన సమావేశంలోనూ దీని గురించి ప్రస్తావిస్తే సానుకూలంగా స్పందించారని చెప్పింది.

## సభకు రా..చర్చిద్దాం : కేసీఆర్ కు సీఎం రేవంత్ రెడ్డి సవాల్

హైదరాబాద్ : పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండలకు కృష్ణా జలాల్లో అన్యాయం చేసిందే కేసీఆర్ అని..దీనిపై అసెంబ్లీకి వచ్చి చర్చించమంటేబహిరంగ సభలకు వెళ్తానని అంటున్నాడని, .. ప్రతిపక్షనేతగా కేసీఆర్ అంగీకరిస్తే జనవరి 2నుంచి అసెంబ్లీ ఏర్పాటు చేసుకుందామని, కృష్ణా నది జలాల పైన ఒక రోజు, గోదావరి జలాలపైన ఒక రోజు అసెంబ్లీలో చర్చకు మేం సిద్ధం అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే గౌరవంగా చూసుకుంటాం%%నాది బాధ్యత అని హామీ ఇచ్చారు. జూబ్లీహిల్స్, సర్పంచ్ ఎన్నికల ఫలితాల..తర్వాత కేసీఆర్ కు తన ప్రతిపక్ష హెూదా గుర్తుకు వచ్చిందన్నారు. కేసీఆర్ జంకు లేకుండా రంకు మాటలు మాట్లాడుతున్నాడని, కేసీఆర్ కు రాజకీయ బిక్ష పెట్టిందే మహబూబ్ నగర్ జిల్లా అని, అటువంటి జిల్లాకు కేసీఆర్ తీరని ద్రోహం చేశారని రేవంత్ రెడ్డి విమర్శించారు. సమైక్య రాష్ట్రంలో కంటే కేసీఆరే తెలంగాణ కు తీరని అన్యాయం చేశాడన్నారు. కేసీఆర్ హయాంలోనే జలదోపిడి జరిగిందని, కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా 299 టీఎంసీలకు కేసీఆర్ సంతకం పెట్టి మరణశాసనం రాశాడని మండిపడ్డారు. మూడు జిల్లాలపైన కేసీఆర్ మరణశాసనం రాశాడని, కృష్ణా జలాలపైన శాశ్వతంగా ఎపీకి హక్కులు రాసి ఇచ్చాడని, పాలమూరు రంగారెడ్డి కి జూరాల నుంచి కాకుండా శ్రీశైలంపై నుంచి నీళ్లు తీసుకోవడం ద్వారా అన్యాయం చేశాడని..ఇప్పుడు దొంగే దొంగ అన్నట్లుగా మాట్లాడుతున్నాడని రేవంత్ రెడ్డి విమర్శించారు.

పాలమూరు ప్రాజెక్టులను పడకేయించాడు

పోతిరెడ్డి, ముచ్చుమర్రి లాంటి ప్రాజెక్టులను ఎపీ నిర్మించుకుంటున్నా కేసీఆర్ పట్టించుకోలేదని, 10 ఏళ్లలో సాగునీటి ప్రాజెక్టు లపైన 2 లక్షల కోట్లు ఖర్చు పెట్టాడు.. 1.80 లక్షల కోట్ల బిల్లులు చెల్లించాడని, పదేళ్లలో ఒక్క ప్రాజెక్టును కూడా కేసీఆర్ పూర్తి చేయలేదు అని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఎస్ ఎల్ బీసీ , డిండి , కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, పాలమూరు రంగారెడ్డి ఇలా ఏ ప్రాజెక్టు పూర్తి చేయలేదు అని, సంగంబండలో బండ పగలకొట్టడానికి కనీసం 12 కోట్లు కూడా విడుదల చేయలేదు అని, కల్వకుర్తి లో భూసేకరణకు డబ్బులు ఇవ్వలేదు అన్నారు. మా ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టు లపైన 6800 కోట్లు ఖర్చు చేశాం అని రేవంత్ రెడ్డి తెలిపారు.

తెలంగాణ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేశాడు

తెలంగాణ ఆర్థిక వ్యవస్థను కేసీఆర్ సర్వనాశనం చేశాడని, ఆర్థిక ఉగ్రవాది కేసీఆర్ అని..ఆర్థిక వ్యవస్థపైన అత్యాచారం చేశాడని రేవంత్ రెడ్డి విమర్శించారు. రూ.8.11లక్షల కోట్ల అప్పులు చేశాడని, అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయకుండా కమిషన్లతో దోచుకున్నాడన్నారు. మేం వచ్చాక అధిక వడ్డీ అప్పులను చెల్లిస్తూ రూ.4వేల కోట్ల భారం తగ్గించామయన్నారు. కేసీఆర్ పాలమూరు రంగారెడ్డి డీపీఆర్ కూడా సరిగా తయారు చేయకపోవడంతో కేంద్రం వెనక్కి పంపిందని, అది కూడా కేసీఆర్ పాలన కాలం 2023ఏప్రిల్ లోనే వెనక్కి వచ్చిందన్నారు. 45 టీఎంసీలు మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నుంచి ,మరో 45 టీఎంసీ లు పట్టిసీమ నీళ్లు వాడుకుంటామని చెప్పారని, పాలమూరు రంగారెడ్డి పైన ఎన్ జీ టీలో కేసులు వేసింది బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బీరం



హర్షవర్ధన్ రెడ్డి అని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. హర్షవర్ధన్ రెడ్డికి కొల్లాపూర్ లో టిక్కెట్ ఇచ్చింది కేసీఆర్ కాదా..? అని ప్రశ్నించార. కృష్ణా జలాల్లో ఎపీకి 64 శాతం, తెలంగాణకు 29 శాతం వాటాకు కేసీఆర్ సంతకం చేశారని, కేసీఆర్ కమిషన్లకు అమ్ముడుపోయి తక్కువ వాటాకు అంగీకరించాడని రేవంత్ రెడ్డి విమర్శించారు.

కొడుకు, అల్లుడు పంచాయతీతోనే బయటికి వచ్చాడు

బీఆర్ఎస్ లో కొడుకు, అల్లుడు కొట్లాడుకుంటున్నారని, అల్లుడు చేతికి పార్టీ పోతుందన్న భయంతోనే కేసీఆర్ బయటకు వచ్చాడు అని, గోదావరి జలాలను రాయలసీమ తరలించుకుపొమ్మని చెప్పింది ఎవరో అసెంబ్లీలో తేల్చుదాం అని రేవంత్ రెడ్డి అన్నారు. సభకు రాకుండా కేసీఆర్ మోహం చాటేస్తున్నాడు అని, కొడుకు కుర్చీ కోసం, అల్లుడు ఆస్తుల కోసం ప్రయత్నం చేస్తున్నారని, లోక్ సభ, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఎన్నికలు పార్టీ సింబల్స్ పైనే జరిగాయి కదా..? అని మరి అందులో బీఆర్ఎస్ ఎందుకు ప్రజాతిరస్కరణకు గురైందని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. సర్పంచ్ ఎన్నికలపైన నిజనిర్ధారణ కమిటీ వేసి ఏ గ్రామానికైనా వెళ్లి పరిశీలిద్దాం..ఏ పార్టీ గెలిచిందో తెలుస్తుందన్నారు. కేసీఆర్ వయసుకు నేను గౌరవం ఇస్తున్నానని, కేసీఆర్ క్రియాశీలక రాజకీయాల్లో లేరు.. చట్టసభల్లో ప్రతిపక్ష నాయకుడి పాత్ర పోషిస్తేనే క్రియాశీలకంగా ఉన్నట్లు అన్నారు. తమల పాకుతో నన్ను ఒకటి అంటే నేను తలుపు చెక్కతో ఒకటి ఇస్తానన్నారు. పదేళ్లలో కేసీఆర్ కాంగ్రెస్ కట్టిన ఓఆర్ఆర్ తో పాటు భూములను అమ్ముకున్న ఘనుడు కేసీఆర్ అని, హైదరాబాద్ లో ఏం చేశారో కేసీఆర్ ఒక్కటి చూపించా లని, కృష్ణా జలాలో తక్కువ వాటాకు అంగీకరిస్తు సంతకం చేసిన కేసీఆర్ ముందుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. 299 టీఎంసీల్లో తెలంగాణ ఇప్పటి వరకు సరైన వాటాను వాడుకోలేదు అని,

కూలేశ్వరం లేకపోయినా వరి దిగుబడిలో రికార్డు

కాళేశ్వరం కూలేశ్వరం అయినా వరి ఉత్పత్తిలో తెలంగాణ ను నెంబర్ 1 గా నిలబెట్టాం అని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నాడు అని, కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీ లో ఐరన్ లెగ్.. హరీష్ రావును అధ్యక్షుడిని చేయాలని ప్రచారం చేస్తున్నారని, కేసీఆర్ ఉన్నంత కాలం హరీష్ రావు ఎక్కడికి పోడు అని, కేసీఆర్ తర్వాత పార్టీని చేజిక్కించుకోవాలని హరీష్ రావు ప్రయత్నం

## జగన్, షర్మిల మళ్లీ కలిసిపోతున్నారు - పులివెందుల సీనియర్ సంచలనం..!!



ఏపీ రాజకీయాల్లో కీలక పరిణామం. మాజీ సీఎం జగన్ – పీసీసీ చీఫ్ షర్మిల గురించి మరో సారి చర్చ మొదలైంది. తన అన్న జగన్ తో విభేదించిన తరువాత షర్మిల తొలుత తెలంగాణలో సొంత పార్టీతో రాజకీయం చేసారు. తరువాత కాంగ్రెస్ లో చేరి ఏపీలో పీసీసీ చీఫ్ అయ్యారు. 2024 లో పోటీ చేసి ఓడిపోయారు. జగన్ ను టార్గెట్ చేయటానికి ప్రాధాన్యత ఇచ్చిన షర్మిల తీరులో కొంత కాలంగా మార్పు కనిపిస్తోంది. కాగా.. ఇప్పుడు అన్నా – చెల్లి తిరిగి కలిసిపోతున్నారని పులివెందుల వైసీపీ సీనియర్ నేత చెప్పిన అంశాలు ఇప్పుడు సంచలనంగా మారాయి. మాజీ సీఎం జగన్ .. పీసీసీ చీఫ్ షర్మిల తిరిగి త్వరలోనే కలిసిపోయే అవకాశాలు ఉన్నాయని కడప జిల్లా పులివెందుల కు చెందిన వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ సతీష్ కుమార్ రెడ్డి జోస్యం చెప్పారు. జగన్‌కు చెల్లెలు అంటే అభిమానమని, ఆయన ఎప్పుడూ తప్పులు చేయరని తీష్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం వైఎస్ షర్మిల ఏపీసీసీ చీఫ్‌గా వ్యవహరిస్తూ, కూటమిపైనే విమర్శలు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. గతంలో చేసిన విదంగా జగన్‌పై ఆరోపణలు చేయడం లేదన్నారు. ఇది మంచి పరిణామమని, అందరూ స్వాగతించాల్సిందేనని అన్నారు. జగన్‌కు తన చెల్లెలంటే ప్రత్యేక అభిమానం ఉందని, కుటుంబాన్ని ఎప్పుడూ గొప్పగా భావించే వ్యక్తి అని తెలిపారు. తాను జగన్‌ను దగ్గరగా చూశానని, ఆయన ఎప్పుడూ కావాలని తప్పులు చేసే మనిషి కాదని అన్నారు. అన్నా చెల్లెళ్లు మళ్లీ కలిసే అవకాశాన్ని కొట్టిపారేయలేమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా షర్మిల ప్రస్తుతం ప్రధానంగా అధికార కూటమిపైనే విమర్శలు చేస్తూ వస్తున్నారు. జగన్ గురించి కానీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గురించి కానీ ఆమె బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం లేదు. ఒక రాజకీయ పార్టీ నేతగా అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని విమర్శించడం సహజమేనని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. గతంలో వైసీపీపై తీవ్ర విమర్శలు చేసిన షర్మిల ఇప్పుడు వైఖరిలో మార్పు చూపుతున్నారా అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. జగన్ తో విభేదించిన తరువాత తొలిసారి తన అన్న జన్మదినం వేళ శుభాకాంక్షలు చెప్పారు. దీనికి సమాధానంగా జగన్ సైతం ప్రత్యేకంగా షర్మిలను అమ్మా అంటూ ప్రేమ చూపించారు. దీని ద్వారా ఇద్దరి మధ్య తిరిగి సానుకూల వాతావరణం ఏర్పడుతున్నట్లు చర్చ జరుగుతోంది. అయితే, అసలు ఇది సాధ్యమా కాదా అనేది కాలమే డిసైడ్ చేయాల్సి ఉంది. కాగా.. ఈ వ్యవహార ం మాత్రం వైసీపీతో సహా ఏపీ పొలిటికల్ సర్కిల్స్ లో పెద్ద ఎత్తున చర్చగా మారింది.

## ఏపీ, తెలంగాణలోనే ఎస్సీలపై అధిక దాడులు

ఢిల్లీ: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు రామచందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలోనే ఏపీ, తెలంగాణలో ఎస్సీలపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాజా ఉదంతాలను ప్రస్తావిస్తూ సోమవారం ఆయన ఢిల్లీలో సాక్షితో మాట్లాడుతూ..తెలుగు రాష్ట్రాల్లో దళితులపై అధిక దాడులు జరుగుతున్నాయి. దళితులను పోలీసు వ్యవస్థ చిన్న చూపు చూస్తూ అమానుషంగా వ్యవహరిస్తోంది. ఆంధ్రప్రదేశ్ తెనాలిలో ఓ దళితుడిని పోలీసుల రౌడీల్లాగా పాశవికంగా కొట్టారు. ఈ ఘటనపై డీజీపీ ఇప్పటికైనా విచారణ జరిపి పూర్తి నివేదిక పంపాలి. అమరావతిలో దళితుల డీకే పట్టా భూముల విషయంలోనూ దారుణంగా వ్యవహరిస్తున్నారు. భూముల రేట్లు పెరిగిన తర్వాత.. వ్యవసాయం చేయడం లేదనే సాకుతో భూమి లాక్కుంటున్నారు. దీనిపై 85 ఫిర్యాదులు వచ్చాయి వాటిపై విచారణ చేస్తున్నాం. ఇప్పటిదాకా 35 ఎకరాలు భూమి బలవంతంగా తీసుకున్నారు. దానికి ఖచ్చితంగా నష్టపరిహారం ఇవ్వాలి..తెలంగాణ కోదాడలో దళిత యువకుడు కర్ల రాజేష్



లాకప్ డెత్‌పై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి కేసు దర్యాప్తు చేయాలి. ఈ ఘటనలో రీపోస్ట్‌మార్టం జరిగింది. సీఐ సస్పెన్షన్ తో సరిపోదు. ఖచ్చితంగా కేసు పెట్టాల్సిందే అని అన్నారాయన.

## సంపాదకీయం

మంగళవారం 23-12-2025

# ఒక్క యాపిల్‌తో సరిపెట్టుకుందామా?

కేంద్రం 2014లో 'భారత్‌లో తయారీ' పథకం ప్రారంభించినప్పుడు దేశంలో రెండంటే రెండే మొబైల్ ఫోన్ ఉత్పత్తి సంస్థలు ఉండేవి. ఇప్పుడు వాటి సంఖ్య మూడొందలు దాటింది. అప్పట్లో భారత్‌లో తయారైన మొబైల్ ఫోన్ల విలువ రూ.18వేల కోట్లు కాగా, నిరుడు వాటి విలువ రూ.5.45 లక్షల కోట్లకు చేరింది. యాపిల్ వంటి బహుళజాతి కంపెనీలకు స్వాగతం పలికితే, మరిన్ని రంగాల్లో భారత్ దేదీప్యమానంగా వెలుగొందగలదు. నేడు ప్రపంచంలోనే అత్యధికంగా మొబైల్ ఫోన్లను ఉత్పత్తి చేస్తున్న రెండో దేశం ఇండియా. 2014-15లో దేశంలోని మొబైల్ ఫోన్ల గిరాకీలో మూడొంతులను దిగుమతుల ద్వారానే తీర్చుకోవాల్సి వచ్చింది. నిరుడు ఆ అవసరం 0.02శాతానికి తగ్గిపోయింది. అదేకాలంలో భారత్ నుంచి స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు రూ.1,500 కోట్ల నుంచి రెండు లక్షల కోట్ల రూపాయలకు ఎగబాకాయి. ఇవాళ మన దగ్గర నుంచి ఏటా 33కోట్ల మొబైల్ ఫోన్లు విదేశాలకు సరఫరా అవుతున్నాయి. 2020-21 నుంచి భారతీయ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి రంగంలోకి 400కోట్ల డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రవహించాయి. భారత్‌లో తయారీ పథకంలో ఈ రంగానిదే సింహభాగం. దేశంలో స్మార్ట్‌ఫోన్ల ఉత్పత్తికి అవసరమైన వసతులను సమకూర్చడం, ప్రభుత్వం తగిన ప్రోత్సాహక విధానాలను అనుసరించడం వల్లే ఇది సాధ్యపడింది.

ఎగుమతుల వెల్లువ

ప్రపంచబ్యాంకు వ్యాపార సౌలభ్య సూచీలో 2014లో 142 ర్యాంకుతో సరిపెట్టుకున్న భారత్ 2019లో 63వ ర్యాంకుకు చేరింది. భారత్‌లో తయారీ, డిజిటల్ ఇండియా, నైపుణ్య భారత్, దశలవారీ పారిశ్రామికోత్పత్తి పథకం, జాతీయ ఎలక్ట్రానిక్స్ విధానం, ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకం వంటివి దేశాన్ని ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దాయి. అసంఖ్యాక వినియోగదారులు, ప్రీమియం ఫోన్లకు గిరాకీ, వ్యాపార సౌలభ్యానికి ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు సైతం ఇండియాను స్మార్ట్‌ఫోన్ల దిగుమతిదారు స్థితి నుంచి అతిపెద్ద ఎగుమతిదారు హోదాకు తీసుకెళ్లాయి. ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో కార్మిక వ్యయం తక్కువ. నిపుణులైన ఇంజినీర్లకూ కొదవుండదు. ఇవే యాపిల్, సామ్‌సంగ్‌లతో పాటు అనేక చైనా కంపెనీలు ఇండియాలో ఎలక్ట్రానిక్స్, స్మార్ట్‌ఫోన్లను తయారుచేసేలా పురిగొల్పాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి అయిదు నెలల్లోనే భారతీయ స్మార్ట్‌ఫోన్ల ఎగుమతి లక్ష కోట్ల రూపాయలను మించిపోయింది. మూడో త్రైమాసికంలో మన స్మార్ట్‌ఫోన్ మార్కెట్ అయిదు శాతం వృద్ధిని కళ్లజూసింది. ప్రీమియం స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో యాపిల్ హవా కొనసాగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశంలో ఉత్పత్తయిన స్మార్ట్‌ఫోన్ల విలువ 6400 కోట్ల డాలర్లు. అందులో 2410కోట్ల డాలర్ల విలువైన ఫోన్లు విదేశాలకు ఎగుమతి అయ్యాయి. 2015లో భారతదేశ ఎగుమతుల జాబితాలో 167వ ర్యాంకులో ఉన్న స్మార్ట్‌ఫోన్లు నిరుడు మూడో స్థానంలోకి రావడం విశేషం.

కూర్పు సరే... తయారీ ఏదీ?

అమెరికా-చైనా వాణిజ్యపోరు వల్ల తన ఉత్పత్తి కార్యకలాపాలను చైనా వెలుపలకు తరలించాల్సిన అగత్యం యాపిల్‌కు వచ్చింది. టాటా గ్రూప్ యాపిల్ ఫోన్ల విడిభాగాల కూర్పులో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించసాగింది. టాటా, ఫాక్స్‌కాన్‌లతోపాటు దాదాపు 50 యాపిల్ విడిభాగాల సరఫరాదారులు భారత్‌లో యూనిట్లు తెరిచారు. మరో 45 భారతీయ సంస్థలతో యాపిల్ ఒప్పందాలు కుదుర్చుకోగా, వాటిలో సగం ఎంఎస్ఎంఈలే కావడం విశేషం. ఇదంతా ఒక ఎత్తు అయితే- భారత్ ఇప్పటికీ యాపిల్ విడిభాగాల కూర్పుదారుగానే ఉండిపోయింది తప్పితే, పూర్తిస్థాయి తయారీదారుగా మారలేదు. సెమీకండక్టర్లు వంటి సాధనాల ఉత్పత్తిలో భారత్ తన సత్తా చాటుకోవడానికి పరిశోధన-అభివృద్ధిపై దృష్టి సారించడం అత్యావశ్యకం. ఈ ఏడాది రెండో త్రైమాసికంలో అమెరికాలో దిగుమతి అయిన స్మార్ట్‌ఫోన్లలో 44శాతం ఇండియావే. ప్రథమార్ధంలో యాపిల్ సంస్థ భారత్ నుంచి వెయ్యి కోట్ల డాలర్ల విలువైన ఐఫోన్లను ఎగుమతి చేసింది. ఇదే ఊపు కొనసాగితే- ఈ సంవత్సరాంతానికి ప్రపంచ ఐఫోన్ ఉత్పత్తిలో నాలుగో వంతు వాటా ఇండియాదే అవుతుంది. 2028 కల్లా యాపిల్ తన విడిభాగాల్లో 30శాతాన్ని భారత్ నుంచే సేకరించాలన్న షరతును అంతకన్నా ముందే చేరుకోవచ్చు. నేడు ఐఫోన్-17 సహా అధునాతన యాపిల్ మోడళ్లన్నీ ఇండియాలోనే తయారవుతున్నాయి. యాపిల్ భారత్‌లో ఐఫోన్ల తయారీ చేపట్టేనాటికి ప్రపంచ విక్రయాల్లో 0.5శాతం మాత్రమే ఇక్కడ అమ్ముడుపోయేవి. నేడు ప్రపంచ ఐఫోన్ మార్కెట్‌లో 10.4శాతం వాటా మనదే. ఐఫోన్లకు మన దేశం మూడో అతిపెద్ద మార్కెట్‌గా ఆవిర్భవించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో యాపిల్ ఇండియా లాభాలు 16శాతం పెరిగి రూ.3,196 కోట్లకు చేరాయి. భారత్‌లో విస్తరిస్తున్న మధ్యతరగతి నుంచి గిరాకీ పెరుగుతుండటంతో యాపిల్ మరిన్ని స్టోర్లను తెరుస్తోంది.

విశ్వవిపణిలో గట్టి పోటీదారు కావాలంటే...

ఇండియాలో యాపిల్ కార్యకలాపాల వల్ల మూడున్నర లక్షల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించింది. ఈ సంవత్సరాంతానికి మరెన్నో లక్షల మందికి పరోక్షంగా ఉపాధి దొరకనుంది. యాపిల్‌కు విడిభాగాలు సరఫరా చేసే టాటా ఎలక్ట్రానిక్స్, ఫాక్స్‌కాన్ వంటి సంస్థలు అత్యధిక ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు కల్పించాయి. యాపిల్ తీసుకొచ్చిన ఉద్యోగాల్లో 72శాతం మహిళలకే దక్కాయి. భారత్ ప్రపంచస్థాయి ఉత్పత్తి నెట్‌వర్క్‌లతో అనుసంధానమైతే అధిక వేతన ఉద్యోగాలను సృష్టించవచ్చనేందుకు యాపిల్ ఉదంతమే నిదర్శనం. దేశంలోని కార్మిక ఆధారిత సంప్రదాయ పరిశ్రమలతో పోలిస్తే ఎలక్ట్రానిక్స్, యంత్రాలతో నడిచే పరిశ్రమలే వేగవంతమైన వృద్ధిని అందుకుని, పెద్దసంఖ్యలో ఉపాధి అవకాశాలను సృష్టించాయి. ఎగుమతులనూ సాధించాయి. యాపిల్ వంటి మరిన్ని బహుళజాతి సంస్థలను రప్పిస్తే కొరియా, తైవాన్‌ల మాదిరిగా ఇండియా కూడా విశ్వవిపణిలో గట్టి పోటీదారుగా అవతరిస్తుంది. ఆ దిశగా దేశానికి నవకల్పనల భారతంగా పేరు తేవడానికి వచ్చే దశాబ్దకాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. టెక్స్‌టైల్స్, అపెరల్ రంగంలో మంచి పేరున్న ఇండియా- నైకి, గూచి, ఎల్‌వీఎంహెచ్, జారా వంటి అంతర్జాతీయ బ్రాండ్లను సులభంగా ఆకర్షించగలదు. గట్టిగా ప్రయత్నిస్తే- వస్త్రతయారీ రంగానికి ప్రపంచ కేంద్రంగానూ అవతరించగలదు.

# తమిళనాడులో ఎస్ఐఆర్ రగడ..97.37లక్షల ఓట్ల తొలగింపు




న్యూఢిల్లీ: తమిళనాడు గుజరాత్‌రాష్ట్రాలలో చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితాలను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియలో భాగంగా పలు రాష్ట్రాల్లో భారీ సంఖ్యలో ఓట్లు తొలగింపు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో తమిళనాడు, గుజరాత్ లలో నిర్వహించిన సర్ తర్వాతఆ రెండు రాష్ట్రాలలోనూ భారీ సంఖ్యలో ఓట్లు తొలగింపుకు గురయ్యాయి. ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనంతరం 1.71 కోట్ల ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాలో లేవని ఎన్నికల కమిషన్ తెలిపింది. ఒక్క తమిళనాడులోనే సుమారు 97.37 లక్షల ఓట్లను జాబితా నుంచి తొలగించినట్లు ఈసీ వెల్లడించింది. ఇందులో ఒక్క చెన్నైలోనే 14.25 లక్షల ఓట్లు ఉన్నట్టు ఆ రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ అర్చనా పట్నాయక్ శుక్రవారం వెల్లడించారు. సర్ తర్వాత తమిళనాడులో ఓటర్ల సంఖ్య 5,43,76,755గా ఉందని ఆమె వివరించారు. సర్‌కు ముందు రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 6.41 కోట్లని తెలిపారు. పాత జాబితాలోని 97,37,832 ఓటర్ల పేర్లను తొలగించామని వెల్లడించారు. తొలగించిన ఓటర్లలో 26.94 లక్షల మంది మరణించిన వారి ఓట్లు కాగా, 66.44 లక్షల మంది శాశ్వతంగా వలస లేదా వేరే ప్రాంతానికి వెళ్లిపోయిన వారి ఓట్లు అని, 3,39,278 ఓట్లు డూప్లికేట్ ఎంట్రీలు ఉన్నాయని తెలిపారు.

సీఎం స్టాలిన్ ఆగ్రహం

సర్ అనంతరం ఈసీ విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాపై అధికార డీఎంకే ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతకు ముందు బీహార్ రాష్ట్రంలో కూడా కేంద్రం ఇదే అస్త్రాన్ని ప్రయోగించి లక్షలాది మంది నిజమైన ఓటర్లను తొలగించిందని సీఎం స్టాలిన్ ఆరోపించారు. నా సొంత నియోజకవర్గంలోనే లక్షకు పైగా ఓట్లు గల్లంతయ్యాయని తెలిపారు. కేంద్రం ఓట్ల చోరీ ఎత్తుగడలను పారనీవ్వబోమని తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై అన్నాడీఎంకే చీఫ్, మాజీ సీఎం పళనిస్వామి సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో 90 లక్షలకు పైగా ఓట్లను తొలగించినట్లు నివేదికలు వస్తున్నాయని, వీటిలో చాలా వరకు నకిలీ ఓట్లే అని, అందుకే ఎస్ఐఆర్‌ను తమ పార్టీ సపోర్ట్ చేసిందని అన్నారు. నకిలీ ఓట్లను ఉపయోగించి, ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసి, అధికారంలోకి రావాలనుకునే డీఎంకే కల చెదిరిపోయిందన్నారు. సర్ పై ఆందోళనలు చేస్తూ నాటకాలు ఆడుతోందని దుయ్యబట్టారు.

గుజరాత్‌లోనూ 73.74 లక్షల ఓట్లకు కోత

బీజేపీ పాలిత గుజరాత్ రాష్ట్రంలోనూ సర్ ప్రక్రియ సర్ ప్రక్రియ తర్వాత 73.74 లక్షల మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించినట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. అలాగే మధ్యప్రదేశ్‌లో విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో 42 లక్షల మంది ఓటర్లను తొలగించారు. దీంట్లో 22.5 లక్షల మంది వివిధ ప్రాంతాలకు తరలిపోగా, 8.4 లక్షల మంది మరణించారు. 2.5 లక్షల మందికి రెండు చోట్లా ఓట్లు ఉన్నాయి. 8.4 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారని ఈసీ తెలిపింది. 2026 జనవరి 18వ తేదీ వరకు ఓటర్లు తమ అభ్యంతరాలను తెలిపేందుకు అవకాశం ఉందని పేర్కొంది. ఫిబ్రవరి 10వ తేదీ వరకు వీటిని పరిశీలిస్తారని తెలిపింది. ఎస్ఐఆర్ కొనసాగుతున్న పశ్చిమబెంగాల్, రాజస్తాన్, గోవా, పుదుచ్చేరి, లక్షద్వీప్‌లలో ఈ నెల 16వ తేదీన ముసాయిదా జాబితా ప్రకటిస్తామంది. ఇక్కడ మొత్తం 12.32 కోట్ల మంది ఓటర్లు ముసాయిదాలో తమ పేర్లు ఉన్నాయోలేదో చూసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. ఓటర్లు ముసాయిదా ఓటరు జాబితాను http://ceo.gujarat.gov.in అనే వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపింది.

# 'ఉపాధి హామీ' ఉసురు తీస్తున్నారు!




న్యూఢిల్లీ,జి రామ్ జి బిల్లును గురువారం లోక్‌సభ ఆమోదించింది. ఇది చట్టం కాబోతున్నది. అయితే సరికొత్త చట్టం కాదు. ఇప్పటికే ఇది అమలులో ఉన్నది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 గా నిన్నటి వరకు అమలులో ఉన్నది. రాష్ట్రపతి ఆమోదంతో కొత్త పేరు అమలులోకి వస్తుంది. అందులో ఏ అంశాలున్నాయనే విషయం పెద్దగా చర్చించాల్సిన అవసరం లేదు. గ్రామాలలో ఉన్న పేదలకు ప్రత్యేకించి వ్యవసాయ కూలీలకు ఈ చట్టం ఉపాధిని కల్పిస్తున్నది. దాని మీద చర్చలు ఎన్నో జరిగాయి. విమర్శలు, ప్రతి విమర్శలు మరెన్నో వచ్చాయి. అయితే నిరుపేదలకు ఈ చట్టం ఎంతో మేలు చేస్తుందనే విషయంలో ఎటువంటి సందేహం లేదు. అయితే ఈ చట్టంలో గతంలో ఉన్న ముఖ్యమైన అంశం మారిపోతున్నది. అది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా విషయం. గతంలో ఈ పథకం బాధ్యత పూర్తిగా కేంద్ర ప్రభుత్వానిదే. కానీ కొత్త చట్టం ద్వారా ఖర్చులో రాష్ట్రాలపై భారం మోపనున్నది. బడ్జెట్‌లో 60 శాతం కేంద్రం నుంచి, 40 శాతం రాష్ట్రాలు భరించాల్సి ఉంది. ఇంకా కూలీల శ్రమ యంత్రాల వాడకం పైన కూడా కొన్ని నిర్ణయాలు చేశారు. అంతేకాకుండా అత్యంత ముఖ్యమైనది, కూలీల డిమాండ్‌ను బట్టి కాక, ప్రభుత్వాల నిర్ణయాలను బట్టి పనులను కల్పిస్తారు. గతంలో కనీసం వంద రోజుల పని దినాలను కల్పించాల్సి ఉంది. కాని దానిని 125 రోజులకు పెంచారు. ఇది కేవలం కంటితుడుపు మాత్రమే. రాష్ట్రాల మీద గతంలో దీని భారం ఉండేది కాదు. కానీ ఈ రోజు రాష్ట్రాలు ఇందులో ఆర్థికంగా తమ బడ్జెట్‌లను వెచ్చించాలి. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వాలు ఆ వాటాను కల్పించకపోతే, ఆ పథకం అమలు సాధ్యం కాదు. ఇప్పటికే చాలా పథకాల్లో ఇటువంటి షరతులు విధించి, పథకాలనే నిలిపివేసిన ఘటనలున్నాయి. ఎస్సి, ఎస్టి, బిసి విద్యార్థుల పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ పథకం అందులో భాగమే. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటాలను వెచ్చించకపోవడం వల్ల కేంద్రం నిధులను విడుదల చేయడం ఆపేసింది. పంజాబ్ రాష్ట్రంలో ఈ స్కాలర్ షిప్స్ సమస్య ప్రభుత్వాన్నే మార్చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలను రేపు కూలీల ముందు దోషులుగా నిలబడే పరిస్థితి రాబోతున్నది. అంటే జి రామ్ జి పథకం రేపు రాష్ట్ర ప్రభుత్వాల నిస్సహాయతను బజారులో నిలబట్టే పరిస్థితి రాబోతున్నది. దానితో పథకమే ప్రశ్నార్థకం కాబోతున్నది. కేంద్ర ప్రభుత్వం ఆశిస్తున్నది కూడా అదే. క్రమంగా ఈ పథకాన్ని ఆచరణలో రద్దు చేయాలన్నదే ఉద్దేశం. ఇప్పటికే దేశంలోని చాలా రాష్ట్రాలు తమ బడ్జెట్‌ల ద్వారా అమలులో ఉన్న పథకాలనే కొనసాగించలేని పరిస్థితిలో ఉన్నాయి. ఉద్యోగుల జీతాలు, పెన్షన్‌లను సరైన సమయంలో చెల్లించలేని దీనస్థితిలో ఉన్నాయి. వాటికితోడు ఎన్నికల్లో గెలవడానికి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకోకుండా చేసిన వాగ్దానాలు రాష్ట్ర ప్రభుత్వాలకు గుదిబండలుగా మారిపోయాయి. వీటన్నింటిని నిర్వహించడానికి బ్యాంకులనుంచి అప్పులు తీసుకోవడానికి రిజర్వు బ్యాంకు అనుమతి కోసం విరామం లేకుండా ప్రయత్నిస్తున్నాయి. ఒక్కొక్క రాష్ట్రం తమ అప్పుల పరిమితులను దాటిపోయాయి. దీనితో చాలా రాష్ట్రాలు తమ ఆర్థిక స్థితిని మెరుగుపరచుకోవడానికి ప్రభుత్వ భూములను అమ్మకానికి పెడుతున్నాయి. ఇది ఎక్కడి దాకా వెళ్తుందో తెలియదు. సరిగ్గా ఈ పరిస్థితిలో గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తమ బడ్జెట్ నుంచి నిధులను కేటాయించడమంటే అది వాస్తవ విరుద్ధమే అవుతుంది. ఇది మరింత సంక్షోభానికి దారి తీసే అవకాశముంది. అంతిమంగా ఈ పథకమే ఆగిపోయే పరిస్థితులున్నాయి. ఈ పథకాన్ని మొదటి నుంచి బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం వ్యతిరేకత దృష్టితోనే చూస్తున్నది. నిధుల కేటాయింపులు కానీ, ఖర్చు గానీ ఏనాడు డిమాండ్‌కు తగ్గట్టుగా లేవు. దానికి తోడు కార్డులను తొలగించడం అనేది ఒక నిత్య కార్యక్రమంగా పెట్టుకున్నారు. గత రెండేళ్లలో దాదాపు 50 లక్షల కార్డులను దేశవ్యాప్తంగా తొలగించారు. అంతేకాకుండా ఈ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి చేయాల్సినంత ప్రయత్నం చేశారు. ఇప్పుడు ఈ చట్టం అంతిమ సమాధి. దీనికి బిజెపి సామాజిక నేపథ్యమే కారణం. ఈ పథకాన్ని గ్రామాల్లోని ధనిక, మధ్య తరగతి రైతులు వ్యతిరేకిస్తూనే ఉన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులోకి వచ్చిన తర్వాత కూలీలలో వేతనం డిమాండ్ పెరిగిందని, తమ పొలాల్లో పని చేయడానికి ముందుకు రావడం లేదని వాళ్లు వాదిస్తున్నారు. అంతేకాకుండా కూలీలలో పెరిగిన ఈ స్వేచ్ఛ గ్రామాల్లో వ్యవసాయ కూలీ పెరుగుదల అనివార్యమైందని, దానితో వ్యవసాయ ఖర్చులు పెరిగాయని రైతులు తమ వ్యతిరేకతను బహిరంగంగానే వ్యక్తంచేస్తున్నారు. గ్రామాల్లో ఈ వర్గమే బలమైనది. ఓట్లు గాని, ఇతర ఏ రాజకీయ ప్రయోజనాలకు గానీ ఈ వర్గమే ఆధారం. ఇది వర్గం, కులాల రీత్యా ఆధిపత్యం కలిగి ఉంది. అందువల్ల ఈ పథకానికి వ్యతిరేకంగా చర్యలు చేపట్టడమంటే ఆధిపత్య కులాలకు, వర్గాలకు అండగా నిలబడడమే. దీని వల్ల బిజెపి ఆధిపత్య కులాల్లో బలాన్ని స్థిరం చేసుకోవడానికి వీలవుతుంది. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ఈ చట్టానికి తక్షణ లక్షం. బెంగాల్‌లో ధనిక, మధ్య తరగతి వర్గం ప్రస్తుతం మెల్లగా బిజెపి వైపునకు నడుస్తున్నది. దీని వల్ల వాళ్లు మరింతగా బిజెపిని బలపరిచే అవకాశముంది. బెంగాల్‌లో నూటికి 50శాతం మంది ఎస్‌సిలు, ఎస్‌టిలు, ముస్లింలు ఉన్నారు. వీళ్లంతా భూమిలేని నిరుపేదలే. దాని వల్ల ఈ వర్గాలకు వ్యతిరేకంగా మధ్య తరగతి వర్గం కూలీలను సమీకరించే పనిలో పడ్డారు. అందుకే ఈ చట్టం ద్వారా మరో ప్రయోజనం పొందాలని పథకం వేశారు. అదే పేరు మార్పు. అందులో నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించి, రామ్ పేరును చేర్చడం రెండో ప్రయోజనం. ఎందుకంటే ఇక్కడ పరోక్షంగా ముస్లింల మీద వ్యతిరేకత రెచ్చగొట్టడం. మహాత్మా గాంధీ పేరును తొలగించడం వల్ల జరిగే చర్చలో పరోక్షంగా ముస్లింల విషయాన్ని చేర్చి తమకు అనుకూలంగా దీనిని మలుచుకోవడంలో సఫలీకృతం కావాలని ఆలోచన చేస్తున్నారు. మహాత్మాగాంధీ పైన బిజెపి, ఆర్ఎస్ఎస్ వర్గాలకు మొదటి నుంచి సదాభిప్రాయం లేదు. అది మహాత్మా గాంధీ హత్యతోనే బయట పడింది. మహాత్మా గాంధీని హత్య చేసిన నాథ్‌రామ్ గాడ్సే హిందూ మహాసభ నాయకుడు. ఆర్ఎస్ఎస్‌లో కూడా పనిచేశాడని చరిత్రలో ఉన్న విషయం. అదే విధంగా మహాత్మా గాంధీ హత్యానంతరం ఆర్ఎస్ఎస్ శ్రేణులు మిఠాయిలు పంచుకున్నాయని అప్పటి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ గోల్వాల్కర్‌కు రాసిన ఉత్తరంలో పేర్కొన్నారు. అంతేకాకుండా 2014లో అప్పటి బిజెపి ఎంపి సాక్షి మహారాజ్ నాథ్‌రామ్ గాడ్సే జాతీయ వీరుడు అని ప్రకటించారు. అదే విధంగా ఆర్ఎస్ఎస్ ప్రధాన నాయకుడు రాజ్‌భయ్యా నాథ్ గాడ్సేను సమర్థిస్తూ మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. అదే విధంగా నాథ్‌రామ్ గాడ్సేకు ఆశ్రయం ఇచ్చిన వాళ్లలో సావర్కర్ ప్రధానమైన వ్యక్తి. ఆయన అనేక సార్లు గాంధీని విమర్శించిన సందర్భాలు ఉన్నాయి. అయితే గత కొన్ని రోజుల క్రితం ప్రధాని నరేంద్ర మోడీ వీర్ సావర్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, తమ అనుబంధాన్ని చాటుకున్నారు. అయితే బిజెపి మహాత్మా గాంధీని ప్రత్యక్షంగా విమర్శించిన సందర్భాలు తక్కువ. అదే విషయాన్ని గత రెండు రోజుల క్రితం పార్లమెంట్‌లో ఆ పార్టీ ప్రకటించింది. మహాత్మా గాంధీ జయంతిని స్వచ్ఛ అభియాన్‌గా జరుపుకుంటున్న విషయాన్ని కూడా ప్రకటించారు. అది నిజమే. ఇక్కడ గమనించాల్సింది మహాత్మా గాంధీ మీద కోపం ఆయన మీద కాదు. ఆయన ఏ విధానాలను అవలంబించి ముస్లింలను సోదరులుగా చూడాలని ప్రకటించారో ఆ అంశం వాళ్లకు నచ్చదు. ఇప్పుడే ఈ విషయాన్ని లేవనెత్తి, పేరు మార్చడానికి రాబోయే బెంగాల్ ఎన్నికలే కారణం. అక్కడ ముస్లింల మీద వ్యతిరేకతను రెచ్చగొట్టి మిగతా సమాజాన్ని తమ వైపు తిప్పుకోవడానికి ఈ చర్చ వాళ్లకు అవసరం. ఈ రోజు భారత దేశంలో ముస్లింలు ఉండి హిందూ సమాజాన్ని అవహేళన, దాడులు చేస్తున్నారంటే మహాత్మా గాంధీ విధానాలే కారణమని బిజెపి చెప్పదలచుకున్నది. రాబోయేరోజుల్లో మహాత్మా గాంధీ సెక్యులరిజం, సర్వమత సమానత్వం అనే అంశాలమీద వాళ్లు కాకుండా, వివిధ వ్యక్తులతో మాట్లాడించి, ముస్లిం వ్యతిరేకతను తాము ఓట్లుగా మార్చుకునే ప్రయత్నం చేస్తారు. జి రామ్ జి పేరును బాగా ప్రచారం చేయడం ద్వారా మరో ప్రయోజనాన్ని ఆశిస్తున్నారు. మహాత్మా గాంధీ పేరును తొలగించడం మీద విమర్శలు రాముని మీదికి మళ్లించి, వీళ్లంతా రాముని వ్యతిరేకులు, హిందూత్వ వ్యతిరేకులు అని చెప్పడం ద్వారా హిందూ భక్తులను కూడా ఇందులో భాగస్వాములను చేసి, దానిని సంఘటితం చేయాలనుకుంటున్నారు. మహాత్మా గాంధీ పేరును తొలగించడం ద్వారా వారి హిందూత్వ ఎజెండా ఉచ్ఛస్థాయికి చేరింది. ఇక వాళ్లు దేనిని సహించే స్థితిలో లేరు. అంతిమంగా హిందూత్వ భావాలను తమ ఎన్నికల ప్రయోజనాలకు వినియోగించుకొని ప్రయోజనం పొందాలని చూస్తున్నారు. నూటికి ఇరవై మందిగా ఉన్న ఉన్నత ఆదాయ వర్గాలను తమ గుప్పిట్లో పెట్టుకోవడం వల్ల ప్రభుత్వాలను తారుమారు చేసే పథకాన్ని అమలు చేస్తున్నారు. ■

# 29 నుండి జనవరి 2వ తేదీ వరకు

తిరుపతి,తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో డిసెంబరు 29 నుండి జనవరి 2వ తేదీ వరకు తెప్పోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. ఐదు రోజులపాటు జరిగే తెప్పోత్సవాల లో మొదటిరోజైన డిసెంబరు 29వ తేదీన శ్రీ వినాయక స్వామివారు, శ్రీ చంద్రశేఖర్ స్వామివారు పుష్కరిణిలో 9 చుట్లు విహరిస్తారు. నవంబరు 30న శ్రీ వళ్ళి దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యస్వామివారు 9 చుట్లు, డిసెంబరు 31న శ్రీ సోమస్కందస్వామివారు 9 చుట్లు, జనవరి 1న శ్రీ కామాక్షి అమ్మవారు 9 చుట్లు, జనవరి 2న శ్రీ చండికేశ్వరస్వామివారు మరియు శ్రీ చంద్రశేఖర స్వామివారు తెప్పలపై 9 చుట్లు తిరిగి భక్తులకు దర్శనమిస్తారు. ప్రతిరోజూ సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు ఊంజల సేవ, తెప్పోత్సవాలు నిర్వహిస్తారు. జనవరి 3వ తేదీన ఆరుద్ర దర్శన మహోత్సవం సందర్భంగా ఉదయం 6 నుండి రాత్రి 9 గంటల వరకు శ్రీ నటరాజస్వామివారు, శ్రీ శివగామి అమ్మవారు, శ్రీ మాణిక్యవాసగ స్వామివారి ఉత్సవ విగ్రహాలను పురవీధులలో ఊరేగించనున్నారు. తెప్పోత్సవాల సందర్భంగా టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రతిరోజూ భక్తి సంకీర్తనలు ఆలపిస్తారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు...

న్యూఢిల్లీ, తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో కీలక నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ గడువును మరోవారం రోజుల పాటు పొడిగించింది సుప్రీం కోర్టు. డిసెంబర్ 25 వరకు కస్టోడియల్ విచారణ చేసేందుకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. గురువారం ప్రభాకర్ రావు వారం రోజుల కస్టోడియల్ విచారణ పూర్తి అయిన విషయం తెలిసిందే. అయితే ట్యాపింగ్ కేసులో మరికొన్ని రోజులు విచారణ చేయాలని సుప్రీంకోర్టును సిట్ కోరింది. వారం రోజుల కస్టోడియల్ విచారణ రిపోర్ట్‌ను ఉన్నత న్యాయస్థానానికి సిట్ అందజేసింది. దీంతో ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణను వారం రోజుల పాటు పొడిగింపుకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది. డిసెంబర్ 26న పోలీస్ కస్టడీ నుంచి ప్రభాకర్ రావును విడుదల చేయాలని.. తదుపరి విచారణ వరకు ఎలాంటి వ్యతిరేక చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది. పోలీసుల దర్యాప్తుకు సహకరించాలని ప్రభాకర్ రావును సుప్రీంకోర్టు ఆదేశించింది. అంతేకాకుండా ఇంటి నుంచి ఆహారం తెచ్చుకునేందుకు, అవసరమైన మందులు తీసుకునేందుకు ప్రభాకర్ రావుకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది. కాగా.. కొత్త సిట్ ఏర్పాటుతో ట్యాపింగ్ కేసు మరింత వేగవంతంగా విచారణ జరిగే అవకాశం ఉంది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ విచారణ కొనసాగనుంది. కొత్తగా ఏర్పాటు చేసిన సిట్‌లో 9 మంది అధికారులు ఉన్నారు. సీపీ సజ్జనార్‌తో పాటు రామగుండం సీపీ అంబరి కిషోర్ జా కూడా సిట్‌లో ఉన్నారు. గతంలో వెస్ట్ జోన్ డీసీపీగా ఉన్న సమయంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో సిద్ధిపేట సీపీ విజయ్ కుమార్ కీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. మాదాపూర్ డీసీపీ రితి రాజ్, మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డితో పాటు రవీందర్, వెంకట గిరి, కేఎస్ రావు, శ్రీధర్, నాగేందర్ రావుతో కొత్త సిట్ ఏర్పాటు అయ్యింది.

# ఐటి ఉద్యోగులే టార్గెట్‌గా గంజాయి సరఫరా

హైదరాబాద్,రాష్ట్రంలో గంజాయి సరఫరాను అడ్డుకునేందుకు పోలీసులు అనేక రకాలుగా చర్యలు తీసుకుంటున్నారు. గంజాయిని అమ్ముతున్నా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయినప్పటికీ ఎక్కడో చోట గంజాయి సరఫరా జరుగుతూ పట్టుబడటం పోలీసులకు సవాల్‌గా మారింది. తాజాగా నగరంలోని రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో భారీగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐటీ ఉద్యోగులే టార్గెట్‌గా గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన మాదాపూర్ ఎస్వోటీ పోలీసులు.. గంజాయి సరఫరా చేస్తున్న సోహెల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుని వద్ద నుంచి 17 కేజీల గంజాయి, 2 గ్రాముల ఎండీఎంఏ (ఓఆఓం) డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి గంజాయి తెచ్చి ఐటీ ఉద్యోగులకు నిందితుడు సోహెల్ సరఫరా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో బయటపడింది. సోహెల్‌తో పాటు గంజాయి వినియోగించిన ఐదు మంది కన్స్యూమర్లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన రాయదుర్గం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# గేమ్ మొదలు...

హైదరాబాద్,తెలంగాణలో పంచాయతీ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్‌లో దుమారం మొదలైందా? కేటీఆర్ కంటే హరీష్‌రావు తన మద్దతుదారులకు ఎక్కువ మందిని గెలిపించుకున్నారా? ఉత్తర తెలంగాణ నేతలు పార్టీ హైకమాండ్‌పై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారా? ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆ మాట అన్నారా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.

పంచాయతీ ఫలితాలు.. బీఆర్ఎస్‌లో గేమ్ మొదలైందా?

రాజకీయాల్లో ఎత్తుకు పైఎత్తులు ఉంటాయి. సరైన సమయంలో మంచి నిర్ణయం తీసుకుంటే ఉన్నత పదవులను అందుకోవచ్చు. లేకుంటే కష్టమని చాలామంది నేతలకు తెలుసు. తెలంగాణలో పంచాయతీ ఎన్నికల తర్వాత గురువారం సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి మీడియా ముందుకొచ్చారు. బీఆర్ఎస్‌లో జరుగుతున్న అంతర్గత రాజకీయాల గురించి కొన్ని విషయాలు బయటపెట్టారు. ఆ విషయాలు బయటపెడతారని రాజకీయ నేతలు ఊహించలేదు. కొన్నాళ్లుగా బీఆర్ఎస్‌లో అంతర్గతంగా ఆ చర్చ జరుగుతోంది. సరిగ్గా అదే సమయంలో పంచాయతీ ఎన్నికలు వచ్చాయి. పార్టీల కంటే కేటీఆర్ వర్సెస్ హరీష్‌రావు మధ్య ఫైట్‌గా భావించారు. అనుకున్నట్లుగా బామ్మర్దిపై బావ పైచేయి సాధించారు.

హరీష్‌రావు కోసం కొత్త పదవి?

పంచాయతీ ఎన్నికల్లో సిరిసిల్లాలో కాంగ్రెస్ హవా సాగింది. సిద్ధిపేట్ జిల్లాలో కాంగ్రెస్‌కు గట్టిపోటీ ఇచ్చింది బీఆర్ఎస్. ఈ ఎన్నికలను ఓవరాల్‌గా పరిశీలించిన రాజకీయ విశ్లేషకులు.. హరీశ్‌రావుకు 54 శాతం, కేటీఆర్‌కు 35 శాతం వచ్చినట్టు చెబుతున్నారు. ఈ గణాంకాలపై బీఆర్ఎస్ కేడర్ చర్చించుకుంటోంది. కేటీఆర్ కంటే హరీష్‌కు ఎక్కువ స్థానాలు గెలుచుకున్నారని అంటున్నారు. బీఆర్ఎస్‌లో హరీష్‌రావుని మాస్ లీడర్‌గా.. కేటీఆర్‌ను క్లాస్ లీడర్‌గా చాలామంది నేతలు వర్ణిస్తుంటారు. ఆ పార్టీ వర్కింగ్ అధ్యక్షుడిగా కేటీఆర్ ఉన్నారు. ఆయన బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆ పార్టీ ఎక్కువగా ఓటములు ఎదురయ్యాయి. పంచాయతీ ఫలితాలు తర్వాత ఉత్తర తెలంగాణ నేతలు పార్టీ హైకమాండ్‌ని కలిసినట్టు తెలుస్తోంది. హరీష్‌రావుకు పార్టీలో కీలకమైన పదవి

# అమరావతిలో మలేషియా కంపెనీల పెట్టుబడులు

అమరావతి,రాజధాని అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు పలు విదేశీ కంపెనీలు ఆసక్తి కనబరుస్తున్నాయి. తాజాగా అమరావతిలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు మలేషియా కంపెనీలు ముందుకు వచ్చాయి. ప్రజా రాజధానిలో పర్యటించేందుకు మలేషియా బృందం శుక్రవారం అమరావతికి చేరుకుంది. ఈ ప్రతినిధులతో ఉన్నతాధికారుల బృందం సమావేశమైంది. రాజధాని నిర్మాణ పురోగతిని ఈ సందర్భంగా వారికి వివరించింది. అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని మలేషియా బృందంలోని సభ్యులు స్పష్టం చేశారు.ఇక రాజధానితో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టే అవకాశాలను వివరించేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ ప్రతినిధి బృందాలు ఇప్పటికే పలు దేశాలు పర్యటించాయి. నవంబర్ రెండో వారం చివర్లో సీఐఐ ఆధ్వర్యంలో విశాఖపట్టం వేదికగా భాగస్వామ్య సదస్సు జరిగింది. ఈ సదస్సు ద్వారా రాష్ట్రంలో పెట్టుబడులు వెల్లువెత్తాయి. ఇక విశాఖలో గుగూల్ డేటా సెంటర్ సైతం ఏర్పాటు కానున్న సంగతి తెలిసిందే.

# జగన్ సిద్ధమేనా ?

న్యూఢిల్లీ,వ్యవహారం అటు తిరిగి ఇటు తిరిగి బీజేపీతో వైసీపీ యుద్ధం అన్నట్లుగా మారుతోంది. ఏపీలో మెడికల్ కాలేజీల వ్యవహారంలో వైసీపీ మొదటి నుంచి బిగ్ సౌండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రైవేట్ కి ఈ కళాశాలలను అప్పగిస్తున్నారు అని వైసీపీ గట్టిగా మాట్లాడుతోంది, విద్యా వైద్యం ప్రైవేట్ పరం చేస్తున్నారు అని అంటోంది. దీని వల్ల పేదలు పూర్తిగా నష్టపోతారు అని వాదిస్తోంది. ఇక కోటి సంతకాల సేకరణ పేరుతో దీని మీద వైసీపీ పెద్ద ఎత్తున ఉద్యమించింది. ఈ కోటి సంతకాలను తీసుకుని వెళ్ళి గవర్నర్ కి వినతిపత్రం అందించింది. ఈ సందర్భంగా జగన్ చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి.

**జైలులో పెడతా అంటూ :**

జగన్ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తున్న విషయంలో కూటమి ప్రభుత్వం మీద ఫైర్ అవుతున్నారు. ఆయన నేరుగా చంద్రబాబు నే టార్గెట్ చేస్తున్నారు. ఈ విషయంలో ఇతర పార్టీలను ఆయన అనడం లేదు, ఇక ఆయన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ ప్రైవేట్ మెడికల్ కాలేజీలుగా మారుస్తున్న విషయంలో ఎవరెవరు ఉన్నారో వారిని అందరినీ కూడా తాము అధికారంలోకి వస్తే జైలులో పెడతామని సంచలన ప్రకటన చేశారు. అయితే ఆయన మాటలకు టీడీపీ నుంచి ఎటూ రియాక్షన్ ఉంటుంది. కానీ బీజేపీ నుంచి స్ట్రాంగ్ రియాక్షన్ వచ్చింది. అది కూడా కూటమిలో మంత్రిగా ఉన్న సత్యకుమార్ యాదవ్. నిజమే ఆయన రియాక్ట్ కావాల్సిందే. ఎందుకంటే ఆయనే ఆ శాఖను చూస్తున్నారు, పైగా వైద్య ఆరోగ్య మంత్రిగా ఉంటూ ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ఇవ్వడం వల్ల ఏపీకి మేలు జరుగుతుందని ఆయన చాలా స్పష్టంగా చెబుతున్నారు.

**దమ్ముంటే జైలులో పెట్టు :**

వైసీపీకి ఊహించని విధంగా బీజేపీ నుంచి ఘాటైన రియాక్షన్ వచ్చింది. మంత్రి సత్యకుమార్ యాదవ్ జగన్ చేసిన ప్రకటన మీద మాట్లాడుతూ దమ్ముంటే తనను అరెస్టు చేయమని భారీ సవాల్ నే చేశారు. మెడికల్ కాలేజీలను సొంతం చేసుకున్న వారిని అధికారంలోకి వచ్చిన రెండు నెలలలో పంపుతాను అంటున్న జగన్ ముందు తనను జైలులో పెట్టించాలని సత్యకుమార్ యాదవ్ దీని మీద మాట్లాడుతూ ఫైర్ అయ్యారు జగన్ ని బెదిరింపు రాజకీయాలు అని ఆయన మండిపడ్డారు. ఇది ఆటవిక మనస్తత్వానికి నిదర్శనం అని అన్నారు.

**పీపీపీతోనే మేలు :**

తాము పేదలకు మరింత తొందరగా విద్య వైద్యం అందించాలన్న ఉద్దేశ్యంతోనే పీపీపీ మోడల్ లో వెళ్తున్నామని ఆయన చెప్పుకొచ్చారు. అయితే జగన్ మాత్రం పీపీపీ విధానంలో ఆసుపత్రులు కళాశాలలు నిర్మాణం చేయడానికి ముందుకు వచ్చే సంస్థలను వ్యక్తులను జైలుకు పంపిస్తామని చెప్పడమేంటి అని ఆయన ప్రశ్నించారు. జగన్ వారిని జైలుకు పంపించలేరు సరికదా తల వెంట్రుక సైతం పీకలేరని ఆయన అన్నారు.

**ముందు మీ జైలు చూసుకోండి :**

జగన్ అవినీతికి సంబంధిని దాదాపుగా ముప్పయి దాకా కేసులు ఉన్నాయని ఆయన తాను జైలుకు పోకుండా చూసుకుంటే బెటర్ అని మంత్రి ఎద్దేవా చేశారు. నిజానికి ఈ పీపీపీ విధానం అన్నది కేంద్ర ప్రభుత్వం విధానపరంగా తీసుకున్న నిర్ణయం అని మంత్రి అంటున్నారు. ఎన్డీయే ప్రభుత్వం నీతి ఆయోగ్ ప్రతిపాదనతో తీసుకున్న డెసిషన్ అన్నారు. అలాగే న్యాయ స్థానాలు, పార్లమెంటరీ స్థాయీ సంఘం దీనిని సమర్థించాయని చెప్పారు. కేవలం ఏపీ మాత్రమే కాదు దేశంలో 29 రాష్ట్రాలలో ఈ పీపీపీ మోడల్ అమలు అవుతోందని మంత్రి చెప్పారు. అందువల్ల జగన్ కి కనుక ధైర్యం ఉంటే తనను జైలుకు పంపించాలని ఆలాగే తన మీద సీబీఐ విచారణ కోరాలని ఆయన సవాల్ చేశారు.

**మధ్యలో బీజేపీ :**

నిజానికి బీజేపీ ఈ విధంగా అనూహ్యంగా మధ్యలోకి వస్తుందని వైసీపీ ఊహించి ఉండదని అంటున్నారు. ఇది కేవలం టీడీపీ వర్సెస్ వైసీపీగా మారిస్తే రాజకీయంగా తమకు లాభంగా ఉంటుందని వైసీపీ వ్యూహంగా ఉంది. కానీ ఏకంగా బీజేపీ కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ ఇలా అన్నీ ముందుకు వస్తే కనుక వైసీపీ ఏమి చేస్తుందన్నదే అతి పెద్ద చర్చగా ఉంది. జగన్ కూడా ఈ తీరున బీజేపీ మంత్రి నుంచి ఘాటు రియాక్షన్ ఊహించి ఉండరని అంటున్నారు. ఇప్పటిదాకా వైసీపీ బీజేపీని విమర్శించినది లేదు, ఏ విషయం అయినా కూడా టీడీపీనే టార్గెట్ చేస్తూ వస్తోంది. మరి బీజేపీ ఇంత ఘాటుగా రియాక్ట్ అయిన తరువాత ఏకంగా మంత్రి సవాల్ చేసిన తరువాత వైసీపీ మౌనంగా ఉంటే ఏ మాత్రం కుదరదు, అలాగని కమలంతో కయ్యానికి సిద్ధంగా ఉంటుందా అన్నదే ఇప్పుడు ఆసక్తిని కలిగించే విషయంగా ఉంది. చూడాలి మరి. ఈ బిగ్ ట్విస్ట్ లో వైసీపీ ఎలా రియాక్ట్ అవుతుందో.

# భర్త ఓడిన చోట భార్య గెలుపు

సిద్ధిపేట,ఓడిన చోటే గెలవాలన్న సామెతను ఓ మహిళ రుజువు చేసింది. గత ఎన్నికల్లో భర్త ఓడిపోతే ఈ ఎన్నికల్లో పోటీ చేసి భార్య గెలిచింది. గత ఎన్నికల్లో సిద్ధిపేట మండలంలోని చల్లాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ గా రమేష్ పోటీ చేసి ఒక్క ఓటుతో ఓటమి పాలయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో అతని భార్య రోజా భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2019లో చల్లాపూర్ సర్పంచ్ స్థానాన్ని బీసీ జనరల్ కు కేటాయించారు. అప్పట్లో రమేష్ పోటీ చేసి ఒక్క ఓటుతో ఓటమి చెందారు. ప్రస్తుతం ఈ జీపీని బీసీ మహిళకు కేటాయించారు. దీంతో రమేష్ తన భార్య రోజాను కాంగ్రెస్ మద్దతుతో బరిలో దింపారు. ఆమె సమీప ప్రత్యర్థిపై 558 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. గ్రామస్తులు రమేష్ దంపతులను ఘనంగా సన్మానించారు. దోమ మండలంలోని పెద్దతండాచిన్నతండా పంచాయతీలో బుధ వారం నిర్వహించిన సర్పంచ్ ఓట్ల కౌంటింగ్ నువ్వా..నేనా.. అన్నట్లుగా సాగింది. ఇక్కడ కాంగ్రెస్ బలపర్చిన నేనావత్ లక్ష్మణ్, బీఆర్ఎస్ మద్దతుతో ఆంగోత్ గోపాల్ బరిలో ఉన్నారు. వీరి మధ్య సాగిన ఉత్కంఠ పోరులో ప్రత్యర్థి లక్ష్మణ్ పై మూడు ఓట్ల స్వల్ప తేడాతో గోపాల్ విజయం సాధించారు.

# బీజేపీ కొత్త అధ్యక్షుడు నితిన్ నబీన్ ముందున్న సవాళ్లు ఇవే..



న్యూఢిల్లీ,తలపండిన ఉద్దండులు వ్యూహాత్మక ఎత్తుగడలు రాజకీయ చాణక్యులు విభిన్న మనస్కులు ఒక్కొక్కరిది ఒక్కో ఆలోచన దేశ రాజకీయాలను శాసించే నేతలు... భారతీయ జనతాపార్టీలో వాళ్లు అనూహ్య మార్పులతో ప్రయోగాలు చేయడంలో ఆరితేరిన వారుగా పేరుగాంచారు. వాళ్లు ఏమనుకుంటే అదే చేస్తారు.. చేసి చూపిస్తారు. వాళ్ల మాటే శాసనం. వాళ్లే బీజేపీ జాతీయ అధ్యక్షులు జగత్ ప్రకాశ్ నడ్డా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా. వీళ్లే బీజేపీలో త్రిమూర్తులు. వ్యూహాత్మక ఎత్తుగడలతో ప్రయోగాలు రాజకీయ చాణక్యంతో విమర్శలకు తావులేని నిర్ణయాలు తీసుకోవడంలో వారికి వారే సాటి.రాజకీయ పార్టీల్లో బీజేపీ శైలే వేరు. సంస్థాగత నిర్మాణంలో బీజేపీనేతలు క్షేత్రస్థాయిలో కార్యకర్తలనుంచి సలహాలు.. సూచనలు%$\%$ తీసుకోవడం.. పార్టీ పదవులకు ఎవరెవరు ఆసక్తితో ఉన్నారనే అంశంపై తీవ్రస్థాయిలో కసరత్తు చేసిన తర్వాత తీసుకునే నిర్ణయాన్ని అందరూ సమ్మతించాలి. గౌరవించాలి. సంస్థాగతంగా బీజేపీలో ఎన్నడూ లేని విధంగా సరికొత్త సాంప్రదాయం. రెండోసారి ప్రయోగించడంలో అగ్రనేతలు సఫలీ కృతమయ్యారు. భారతీయ జనతాపార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నితిన్ నబిన్ ను నియమించారు. దేశమంతా అన్ని రాష్ట్రాల నుంచి జాతీయ అధ్యక్షపదవి చేపట్టాలని ఉవ్విళ్లూరుతున్న నేతలున్నారు. పార్టీలో పనిచేస్తూ.. సీనియర్ గా పదవిని కోరుకోవడం వేరు..ఆ పదవికి ఉండాల్సిన అర్హతలు వేరు. ఒక రాష్ట్రానికి మాత్రమే పరిమితమైన వ్యక్తిని.. పార్టీ సంస్థాగత నిర్మాణానికి ఏ తరహాలో పనికి వస్తాడోనని అంచనా వేయడంలో పార్టీ పెద్దల దృష్టి కోణం విభిన్నంగా ఉంటుందని అక్షరాలా నిజమైంది. అందుకే ఎవరూ ఊహించని వ్యక్తికి జాతీయ అధ్యక్ష బాధ్యతలను అప్పగించబోతున్నారు.విద్యావంతుడు, రాజకీయ మేధావి బొమ్మరబెట్టు లక్ష్మీ జనార్ధన సంతోష్ భారతీయ జనతా పార్టీతో ప్రత్యేక అనుబంధం. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లో బీఎల్ సంతోష్ పేరుతో సుదీర్ఘ కాలం పనిచేసిన అనుభవం ఆయన సొంతం. సంఘ్ నుంచి పార్టీని సంస్కరించేందుకు 2006లో భారతీయ జనతా పార్టీకి సంస్థాగత వ్యవహారాలను చక్కదిద్దేందుకు జాతీయ ప్రధాన కార్యదర్శి హెూదాలో సేవలు అందిస్తున్నారు. బీజేపీలో సంస్థాగతంగా బాధ్యత, అంకితభావంతో పనిచేసేవారు ఎవరున్నారని గుర్తించి జాబితాను సిద్ధం చేయడంలో ఆయన కీ రోల్ పోషిస్తున్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, క్యాడర్ అభివృద్ధి, ఎన్నికల నిర్వహణను ప్రభావితం చేసే ప్రధాన వ్యూహకర్తలలో ఒకరుగా రాణిస్తున్నారు. 2024లోనే బీజేపీ జాతీయ అధ్యక్ష పదవీకాలం ముగిసింది. ఎన్నికల ముందుగా పార్టీ అధ్యక్షుడిని మార్చడం సరికాదన్నారు. జాతీయ అధ్యక్ష పదవికి కొత్త వారిని నియమించకుండా%$\%$ పదవీకాలాన్ని పొడిగించారు. ఈక్రమంలో ఎన్నికలు జరిగాయి. యేడాది గడిచింది. సంస్థాగత ఎన్నికలపై పార్టీ పెద్దలు దృష్టి సారించారు.భారతీయ జనతాపార్టీలో వర్కింగ్ ప్రెసిడెంట్ అనే పదవే లేదు. అలాంటిది గతంలో అమిత్ షా బీజేపీ జాతీయ అధ్యక్షులుగా ఉన్న సమయంలో పదవీకాలం ముగిసే ముందుగా 2020 జూన్ నెలలో జగత్ ప్రకాశ్ నడ్డాను వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించారు. జాతీయ అధ్యక్ష బాధ్యతలను చేపట్టబోయే ఆరునెలల ముందుగా అవగాహన పెంపొందించుకునేందుకు, పార్టీ ముఖ్య నేతలతో ఎలా మెలగాలనే అంశాలపై పట్టుదానికోసం అవకాశం కల్పించారు. ఆరు నెలల తర్వాత 2021 జనవరి 20 తేదీన జాతీయ అధ్యక్ష బాధ్యతలను అప్పగించారు. జగత్ ప్రకాశ్ నడ్డా పదవీకాలం ముగిసిన తర్వాత కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవాల్సి ఉంది.భారతీయ జనతా పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ పర్యటించిన సందర్భంగా ఔత్సాహికుల పేర్లతో 224 మందితో జాబితా సిద్ధం చేసినట్లు సమాచారం. జాబితాలో వడపోత.. అగ్రనేతల అభిప్రాయాలను తీసుకుని పార్లమెంటరీ కమిటీలో ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించి నిర్ణయం తీసుకున్నారు. బీహార్ రాజకీయాల్లో క్రియాశీలకంగా పనిచేస్తున్న యువనేత నితిన్ నబీన్ ప్రతిభ, సామర్థ్యాలను గుర్తించి కార్యనిర్వాహక అధ్యక్ష బాధ్యతలను అప్పగించారు. ఈ నియామకంతో బీజేపీలో మాటలు కాదు అనూహ్య పరిణామాలతో అగ్రనేతల కన్నుసన్నల్లో పనిచేయగలిగే వారికి పార్టీ జాతీయ అధ్యక్ష బాధ్యతలను అప్పగించారు.బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షపదవికి నితిన్ నబిన్ ను నియమిస్తూ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ పార్టీ సంస్థాగత నియామక ఉత్తర్వులను జారీ చేశారు. కష్టపడి పనిచేసే తత్వం, పార్టీకోసం అంకిత భావంతో పనిచేసే విధానం, పెద్దల పట్ల వినయ, విధేయతలతో నితిన్ నబిన్ పార్టీ పెద్దల దృష్టిలో పడ్డారు. బీహార్ రాజకీయాల్లో బీజేపీ తరపున క్రియాశీలక పాత్ర పోషిస్తున్న నితిన్ వ్యక్తిత్వానికి అగ్రనేతలు ఫిదా అయ్యారు. దీంతో జాతీయ అధ్యక్షుడిగా ఎన్నుకోవా లని పార్లమెంటరీ కమిటీలో చర్చించి సముచిత నిర్ణయం తీసుకున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్ష పదవిపై ఆశలు పెట్టుకున్న చాలా మంది నేతలు ఖంగు తిన్నారు. పెద్దల నిర్ణయాన్ని సమ్మతించారు. అధిష్టాన నిర్ణయాన్ని అందరూ స్వాగతించారు. జాతీయ కార్యనిర్వాహక అధ్యక్ష పదవికి నియమితులైన నితిన్ నబీన్ ఎవరు? ఆయన ప్రత్యేకత ఏంటి? నితిన్ నబిన్ బీహార్ రాజకీయాల్లో విలక్షణ నాయకుడు. 1980 మే 23న రాంచీలో జన్మించిన నబీన్ ఢిల్లీ కల్నల్ సత్సంగ్ కిరణ్ మెమరియల్ స్కూల్లో హయ్యర్ సెకండరీ పూర్తి చేశారు. పదేళ్లపాటు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లో పనిచేశారు. చదువుకునే రోజుల్లోనే విద్యార్థి సంఘంలో కీలక పాత్ర పోషించారు. అఖిల భారత విద్యార్థి పరిషత్, యువ మోర్చాలో రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. నితిన్ నబిన్ తండ్రి నబీన్ కిశోర్ ప్రసాద్ సిన్హా వారసుడిగా రాజకీయల్లోకి వచ్చారు. నాన్న చనిపోవడంతో తొలిసారిగా 2006లో జరిగిన ఉప ఎన్నికల్లో పాట్నా వెస్ట్ నియోజకవర్గం నుంచి పోటీచేసి గెలిచారు. ఆ తర్వాత బాంకీపూర్ నియోజకవర్గంనుంచి వరుసగా నాలుగు సార్లు విధాన సభకు ఎన్నికయ్యారు. ప్రజల విశ్వాసంతో ఓటమి ఎరుగని నేతగా ఎదిగారు. మంచి నాయకుడిగా బీహార్ రాజకీయాల్లో ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన నితిన్ నబిన్ మూడు సార్లు కేబినెట్ మంత్రిగా పనిచేశారు. 2021లో తొలిసారిగా రోడ్డు నిర్మాణ మంత్రిగా వ్యవహరించారు. 2024లో న్యాయశాఖ, పట్టణ అభివృద్ధి, గృహ నిర్మాణశాఖ మంత్రిగా పనిచేశారు. తాజాగాబీహార్ లో జరిగిన ఎన్నికల్లో రోడ్డు నిర్మాణశాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.బీజేపీలో సంస్థాగతంగా 2016లో భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. 2019లో భారతీయ జనతా యువ మోర్చా జాతీయ కార్యదర్శిగా నియమితులయ్యారు. 2023లో ఛత్తీస్ ఘడ్ రాష్ట్రానికి కో ఇన్ ఛార్జ్ గా పనిచేశారు. 2024లో ఛత్తీస్ ఘడ్ ఎన్నికల ఇన్ ఛార్జిగా పనిచేసి అక్కడ పరిస్థితులకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి కృషిచేశారు. ఎన్నికల్లో సత్ఫలితాలు సాధించడంలో వ్యూహాత్మకంగా వ్యవహరించడంలో మంచి పేరు తెచ్చుకున్నారు.వినయ విధేయతలు, పార్టీకోసం కష్టపడి పనిచేసే తత్వంతో నితిన్ నబిన్ ను పార్టీ పెద్దలు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్ష బాధ్యతలను అప్పగించారు. నితిన్ నబిన్ నియామకం పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శుభాకాంక్షలు తెలిపారు. యువకుడైన నితిన్ నబిన్ కష్టపడి పనిచేసే తీరు, అంకిత భావంతో పార్టీకోసం శ్రమించే తత్వంతో బీహార్ ఎన్నికల్లో ఓటమి ఎరుగని నేతగా రాణించడం, ఛత్తీస్ ఘడ్ ఎన్నికల్లో ఇన్ ఛార్జిగా మంచి ఫలితాలను సాధించారని గుర్తు చేశారు.

# సర్వం కేంద్ర ప్రభుత్వ ఇష్టారాజ్యం

న్యూఢిల్లీ,పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం సంస్కరణల పేరుతో వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడమే కాక, మందబలంతో ఏకచ్ఛత్రాధిపత్యం వహించింది. విపక్షాలు లేవదీసిన అభ్యంతరాలకు సరైన సమాధానాలు చెప్పడం లేదు సరికదా, చర్చకు కూడా అవకాశం లేకుండా బుల్‌డోజర్ సంస్కృతి అవలంబించింది. ఉన్నత విద్యారంగాన్ని తన గుప్పెటలో పెట్టుకోవడానికి శ్రీకారం చుట్టింది. ఆత్మనిర్భర్ భారత్ నినాదంతో ఇతర దేశాలపై ఆధారపడే దుస్థితినుంచి బయటపడాలంటూ పదేపదే ప్రబోధించే మోడీ ప్రభుత్వం బీమా, అణువిద్యుత్ రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు స్వాగతం పలకడం, ముఖ్యమైన వ్యవస్థలను విదేశాలకు తాకట్టుపెట్టడం ఈ పార్లమెంట్ సమావేశాల్లో ప్రత్యేకత. ఇది కాక యుపిఎ ప్రభుత్వ చిహ్నాలను, మహాత్మాగాంధీ పేరును పూర్తిగా చెరిపేసేందుకు చరిత్రాత్మక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసింది. ఈ పథకాన్ని తన అధీనం లోకే తెచ్చుకుని తన పెత్తనంతోనే పనులు సాగేలా మార్చుకుంది.ఈ పథకంలో 100 రోజుల పనిదినాలను 125 రోజులకు పెంచి ఉద్ధరిస్తున్నట్టు నమ్మిస్తున్నా దాని అసలు స్వరూపం వేరేగా ఉంటోంది. ఏ రాష్ట్రంలో, ఎక్కడ, ఏ పనులు చేపట్టాలో కేంద్రమే నిర్ణయిస్తుంది.ఏ రాష్ట్రానికి ఎంత బడ్జెట్ కేటాయిస్తుందో ఆ మేరకే పనులు చేపట్టాలి. అదీ కూడా అవసరం బట్టే పని కల్పన ఉంటుంది. అంటే రాష్ట్రాలకు ఇందులో ఎలాంటి స్వేచ్ఛ లేనట్టే. ఇక నిధుల వ్యయంలో ఇంతవరకు శ్రామికుల వేతనాలు పూర్తిగా, సామగ్రి వ్యయంలో 75% నైపుణ్యం, పాక్షిక నైపుణ్య కార్మికుల వేతనాల్లో 75 శాతం కేంద్రమే చెల్లించేది. కానీ ఇకనుంచి మొత్తం వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వమే 40 శాతం వరకు భరించక తప్పదు. 90ః 10 గా ఉన్న వ్యయం ఇకనుంచి 60ః40 గా ఉంటుంది. ఇంత భారీ వ్యయాన్ని రాష్ట్రాలు ఎంతవరకు భరించగలవో ఆలోచించాలి. ఈ వివాదాస్పద నిర్ణయంపై కాంగ్రెస్‌తో సహా విపక్షాలన్నీ భగ్గుమంటున్నాయి. జాతీయ స్థాయిలో వ్యతిరేక ఉద్యమానికి సన్నద్ధమవుతున్నాయి. కేంద్రం మితిమీరిన పెత్తనానికి మరో తార్కాణం ఉన్నత విద్యారంగం. ఉన్నత విద్య క్రమబద్ధీకరణ చట్టాన్ని పూర్తిగా ఏకీకృతం చేస్తూ వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ (వి బిఎస్‌ఎ) బిల్లును తీసుకొచ్చింది. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి), ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ), నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్స్ ఎడ్యుకేషన్ (ఎన్‌సిటిఇ) పర్యవేక్షణ అధికారాలన్నీ ఒకే రెగ్యులేటర్ కిందకు తెస్తూ హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఏర్పాటు చేస్తోంది.అన్ని కేంద్ర యూనివర్శిటీలు, వాటి కిందగల కాలేజీలు, విద్యామంత్రిత్వశాఖ పరిపాలన కింద గల జాతీయ ప్రాముఖ్యత గల సంస్థలన్నీ ఈ కమిషన్ కిందకే వస్తాయి. ప్రస్తుతం యుజిసి కింద లేని ఐఐటిలు, ఐఐఎంలు, ఎన్ఐటిలు, ఐఐఎస్‌సిలు, ఐఐఎన్ఇఆర్‌లు, ట్రిపుల్ ఐటిలు కూడా ఈ కమిషన్ కిందకే వస్తాయి. ఈ విబిఎస్‌ఎ కమిషన్‌లో తనకు అనుకూలమైన తొమ్మిది మందిని కేంద్రమే నియమిస్తుంది. ఈ బిల్లుపై రాష్ట్రాలకు ఎలాంటి హక్కులు ఉండవు. రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయాలు కూడా కేంద్ర అధిష్టానం ఆదేశాలకే లోబడాల్సి వస్తుంది. ఇక బీమా రంగంలో విదేశీ సంస్థలు పూర్తిస్థాయిలో ప్రవేశించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బీమా రంగంలో ప్రస్తుతం



74% వరకు ఉన్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 100 శాతం పెంచడానికి వీలుగా బిల్లును రూపొందించింది. జిడిపిలో 3 శాతం వాటాకు పరిమితమైన బీమారంగం ఇక నుంచి విదేశాల్లో మాదిరిగా ఆరున్నర శాతానికి చేరుతుందని ప్రభుత్వం నమ్మబలుకుతోంది.నూరు శాతం ఎఫ్‌డిఐలతో విదేశీ కంపెనీలు తక్కువ మూలధనంతో ఇకపై ఇక్కడ వ్యాపారాలు పెట్టుకోవచ్చు. ఇప్పటివరకు 65 శాతం వాటాతో అత్యంత బలంగా ఉన్న ప్రభుత్వ రంగ ఎల్‌ఐసికి ఇప్పుడు అగ్నిపరీక్షే ఎదురవుతుంది. బీమా రంగంలో వంద శాతం ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులకు తలుపులు తెరిచిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు అణుశక్తి బిల్లు రూపంలో మరో వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. అణుశక్తిని స్థిరంగా వినియోగించుకుంటూ అభివృద్ధి పథం వైపు దేశాన్ని తీసుకెళ్లడమే లక్షంగా 'శాంతి బిల్లు' ను ప్రవేశపెట్టినట్టు మోడీ ప్రభుత్వం ప్రకటిస్తోంది. అణు విద్యుత్ సంస్థాపిత సామర్థం ప్రస్తుత 8.8 గిగావాట్లు నుంచి 2047 నాటికి 100 గిగావాట్లకు పైగా పెంపు చేయడమే లక్షంగా 2008లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం అమెరికాతో సివిల్ అణుశక్తి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అయితే రియాక్టర్లలో ఏదైన ప్రమాదం సంభవిస్తే మానవ ప్రాణ, పర్యావరణ నష్టానికి ఆ రియాక్టర్ల సరఫరాదారు పరిహారం చెల్లించాలని సివిల్ లయబిలిటీ బిల్లు తీసుకు రాగా, అమెరికా కంపెనీలు వ్యతిరేకించడంతో బిల్లు అమలు కాలేదు.ఈ పరిహారం విషయంలో సడలింపు కల్పించి దాన్ని మోడీ ప్రభుత్వం అమలులోకి తీసుకు వస్తోంది. 1962 అణుశక్తి చట్టం, 2010 పౌర అణు నష్టపరిహార చట్టాన్ని రద్దు చేయాలనే బిల్లు లోని నిబంధనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రమాదాలు సంభవించినప్పుడు రియాక్టర్ల సరఫరాదారుల నష్టపరిహార చెల్లింపు బాధ్యత కేవలం 300 మిలియన్ డాలర్లకే పరిమితం చేయడం ప్రజలభద్రతను నిర్లక్షం చేయడమే. జపాన్‌లో పుకుషిమా, రష్యాలో చెర్నోబిల్ అణుప్రమాదాలు నేర్పిన గుణపాఠాలు ఇప్పుడు విస్మరించడం ఎవరికీ క్షేమం కాదు. నియంత్రణలన్నీ ప్రభుత్వం చేతిలోనే ఉంటాయని చెబుతున్నప్పటికీ బహుళజాతి కంపెనీలు ఎంత శక్తిమంతమైనవో భోపాల్ యూనియన్ కార్బైడ్ గ్యాస్ లీక్ ప్రమాదం సంఘటనే ప్రత్యక్ష సాక్షం. ఈ బిల్లు ద్వారా అమెరికా, ఫ్రాన్స్ వంటి విదేశీ కంపెనీలకే తప్ప భారత కంపెనీలకు ప్రయోజనం శూన్యం అన్న విమర్శలు వస్తున్నాయి.

# పండగ సీజన్‌తో ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, పండగ సీజన్ వచ్చేసింది. క్రిస్మస్, సంక్రాంతి పండగలకు స్కూళ్ల సెలవులు ఇప్పటికే ప్రకటించేశారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వివిధ రైల్వే జోన్లలో ప్రత్యేక రైళ్లను రైల్వే శాఖ నడుపుతోంది. అయినా ప్రతియేడు రైళ్లలో ప్రయాణించే వారి సంఖ్య పెరుగుతోంది. వీళ్లను దృష్టిలో పెట్టుకుని దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 244 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే శాఖ తాజాగా ప్రకటించింది. రానున్న రోజుల్లో మరిన్ని రైళ్లను నడిపే అవకాశం ఉందంటూ రైల్వే మంత్రిత్వ శాఖ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించింది. దేశవ్యాప్తంగా అత్యధిక డిమాండ్ ఉన్న ప్రధాన మార్గాల్లో ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయని రైల్వే శాఖ తెలిపింది. ముంబై – నాగ్‌పూర్, పూణెలి – సంగానేర్ తదితర మార్గాల్లో అదనపు రైళ్లను నడుపుతోంది. ఢిల్లీ, హౌరా, లక్నో తదితర నగరాలను అనుసంధానించేలా ప్రత్యేక రైళ్లను నడపనుంది. అలాగే హైదరాబాద్, బెంగళూరు, మంగళూరు, ఇతర నగరాల మధ్య అదనపు రైళ్లు నడవనున్నాయి.తిరువనంతపురం, పూణెలి – సంగనేర్, అ÷ూఓ÷– నాగ్‌పూర్ తదితర మార్గాల మధ్య రైళ్లు నడుస్తాయి. తెలుగు రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో ప్రత్యేక రైళ్లను నడుపుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వీటిలో సీట్లు సైతం ఫుల్ అయిపోయాయి.

# నకిలీ కుల ధృవీకరణతో ఎన్నిక

కామారెడ్డి, తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తయి.. ఆ వెంటనే ఫలితాలు సైతం వెలువడ్డాయి. ఈ ఎన్నికల్లో నకిలీ కుల ధృవీకరణ పత్రంతో సర్పంచ్ పదవికి ఎన్నికైనట్లు గ్రామస్తులు తాజాగా గుర్తించారు. దాంతో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు వారంతా చేరుకుని ఆందోళన బాట పట్టారు. అతడిని సర్పంచ్ పదవి నుంచి వెంటనే తొలగించి.. మళ్లీ గ్రామ పంచాయతీ ఎన్నిక నిర్వహించాలంటూ కలెక్టరేట్ ఎదుట గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లాలో చోటు చేసుకుంది. జిల్లాలోని రాజంపేట మండలం అన్నారం గ్రామం ఎస్టీ రిజర్వుడ్‌గా నిర్ణయించారు. ఈ గ్రామం నుంచి సర్పంచ్ అభ్యర్థిగా రవీందర్ బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో అతడు సర్పంచ్‌గా విజయం సాధించాడు. అయితే అతడు ఎస్టీ కాదని.. నకిలీ కుల ధృవీకరణ పత్రం ద్వారా ఈ ఎన్నికల బరిలో నిలిచినట్లు ఆ తర్వాత గ్రామస్తులు గుర్తించారు. దాంతో శుక్రవారం ఉదయం కామారెడ్డి జిల్లా కలెకర్ట్ కార్యాలయానికి గ్రామస్తులంతా చేరుకుని.. ఆందోళన చేపట్టారు. తప్పుడు కుల ధృవీకరణ పత్రం ద్వారా రవీందర్ ఈ ఎన్నికల బరిలో నిలిచి గెలిచారంటూ విమర్శించారు. అతడిని సర్పంచ్ పదవి నుంచి డిస్మిస్ చేసి.. గ్రామ పంచాయతీకి మళ్లీ ఎన్నిక నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలోని ఏవోకు అన్నారం గ్రామస్తులు వినతి పత్రం సమర్పించారు.

# రైతుకు మిల్లర్లు ఇచ్చింది నకిలీ నోట్లా?

నిజామాబాద్,నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలో దొంగ నోట్ల కలకలం రేగడంతో పోలీసులు రంగంలోకి దిగారు. పంట అమ్మగా వచ్చిన నగదును రైతు తీసుకున్నాడని తెలుస్తోంది. అయితే ఈ డబ్బు మిల్లర్ల నుంచి రైతుకు అందిందని అంటున్నారు. స్థానిక కెనరా బ్యాంక్‌లో పంట రుణం చెల్లించేందుకు రైతు తీసుకువచ్చిన నగదును దొంగ నోట్లుగా అధికారులు గుర్తించారు. రైతు తీసుకు వెళ్లిన రూ. 2,08,500 నగదు మొత్తం బ్యాంక్ అధికారులు నకిలీవిగా తేల్చారు. మొత్తం రూ. 500 నోట్లుగా గుర్తించారు. జలాల్‌పూర్ గ్రామానికి చెందిన నరెడ్ల చిన్న సాయిలు గతంలో కెనరా బ్యాంకులో రుణం తీసుకున్నాడు. ఈ నగదు చెల్లించేందుకు గురువారం మధ్యాహ్నం కెనరా బ్యాంకులు వెళ్లాడు. కౌంటర్‌లో ఆ నగదును చెల్లించాడు. అనంతరం ఈ నగదును బ్యాంకు సిబ్బంది లెక్కిస్తుండగా.. అవి నకిలీ నోట్లుగా గుర్తించారు. ఈ విషయాన్ని బ్యాంక్ ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఈ నగదు ఎక్కడి నుంచి తీసుకు వచ్చావంటూ రైతు నరెడ్ల చిన్న సాయిలును బ్యాంకు అధికారులు, సిబ్బంది నిలదీశారు. దాంతో రైతు అక్కడి నుంచి పరారయ్యాడు. దీనిపై పోలీసులకు బ్యాంకు సిబ్బంది ఫిర్యాదు చేశారు. రైతు కోసం పోలీసులు గాలిస్తున్నారు. అయితే ఇటీవల వర్ని మండలంలోఈ రైతు తన ధాన్యాన్ని మిల్లర్లకు బ్రోకర్ ద్వారా విక్రయించాడు. అతడికి వారు నగదు చెల్లించినట్లు సమాచారం అందుతుంది. చిన్న సాయిలు.. తన సోదరి ఇచ్చిన నగదు మొత్తం బ్యాంకులో జమ చేసేందుకు వెళ్లగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ నగదు ఒక్కడే ఇచ్చాడా? లేకుంటే వేర్వేరు ప్రాంతాల నుంచి తెచ్చాడా? అనేది తేలాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బాన్సువాడలో భారీ ఝలక్!

హైదరాబాద్, స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్ పార్టీలో కాకరేపుతున్నాయి. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు దార్లను ఓడించేందుకు సొంత పార్టీ నేతలు ప్రయత్నాలు చేశారన్న టాక్ వినిపిస్తోంది. సర్పంచ్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సిట్టింగ్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి నియోజకవర్గాన్ని క్లీన్ స్విప్ చేసేందుకు ప్రయత్నించారు. అన్ని గ్రామాలపై తనకు మంచి పట్టు ఉండటంతో.. తన మద్దతు దార్లను టికెట్ ఇచ్చి.. గెలిచేందుకు కృషి చేశారు. కానీ అక్కడే పోచారంకు ప్రత్యర్థిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి రంగంలోకి దిగేసి రెబల్స్ బరిలో దింపినట్టు తెలుస్తోంది. ఇలా ఇద్దరు నేతల మద్దతు దార్లు ఢీ అంటే ఢీ అనడంతో.. గులాబీ పార్టీకి సీట్లు పెరిగినట్టు ప్రచారం జరుగుతోంది.బాన్సువాడ నియోజకవర్గంలో మొత్తం 137 గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు జరిగాయి. ఇందులో పోచారం శ్రీనివాస్ రెడ్డి బలపరిచిన 111 మంది అభ్యర్థులు విజయం సాధించారు. అయితే మిగతా 16 చోట్ల మాత్రం బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు గెలుపొందారు. అయితే బీఆర్ఎస్ పార్టీ గెలుపు వెనుక మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి ఉన్నారని పోచారం వర్గం ఆరోపిస్తోంది. అన్ని గ్రామాల్లో ఏనుగు అనుచరులు రెబల్స్ గా బరిలో నిలవడంతో కాంగ్రెస్ మద్దతుదార్లు ఓడిపోయారని పోచారం తనయుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ఆరోపిస్తున్నారు. ఏకంగా ఏనుగు రవీందర్ రెడ్డి సొంతూరులోనూ కాంగ్రెస్ మద్దతు దారు ఓడిపోయారని ఆరోపంచారు. బాన్సువాడ నియోజకవర్గం అంతటా బీఆర్ఎస్, బీజేపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు ఆయన సహకరించారని ఆరోపించారు.అయితే ఎవరెన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా బాన్సువాడ నియోజకవర్గంలో 40 మంది సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నా మని భాస్కర్ రెడ్డి అంటున్నారు. బీర్కూర్‌లో బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి గెలిస్తే అక్కడికి వెళ్లి ఏనుగు రవీందర్ రెడ్డి సన్మానించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. అయితే కాంగ్రెస్ పార్టీలో ఉంటూ సర్పంచ్ ఎన్నికల్లో ఇతర పార్టీలకు సహకరిస్తున్న ఏనుగు రవీందర్ రెడ్డి అసలు ఏ పార్టీలో ఉన్నారో తేల్చుకోవాలని పోచారం భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూనే ఇతర పార్టీలకు సహకరిస్తున్న ఏనుగు రవీందర్ రెడ్డి ఏ పార్టీలో ఉన్నారో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాన్సువాడ నియోజకవర్గానికి రావద్దని పార్టీ అధిష్టానం ఆదేశించినప్పటికీ బాన్సువాడకు ఎందుకు

# ఏపీ బీజేపీకి ఏమైంది.. ఆ ఒక్కరూ తప్ప!



అమరావతి, ఏఎ బీజేపీలో వింత పరిస్థితి కొనసాగుతోంది. పొత్తుతో పదవులు దక్కించుకున్న వారు సైలెంట్ గా ఉంటున్నారు. గతంలో వైసీపీతో అంటగా కి ప్రస్తుత ప్రభుత్వంలో ప్రాధాన్యం లభించని వారు సైతం సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోయారు. అయితే తాను బిజెపికి దత్తపుత్రుడునని.. తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామిగా ఉన్నా.. బిజెపి తనను విడిచిపెట్టదని అర్థం వచ్చేలా జగన్ ప్రవర్తన ఉంది. జగన్ వైఖరితో బిజెపి విషయంలో టిడిపి తో పాటు జనసేనకు అనుమానం ఉంది. మరోవైపు ప్రధాని నరేంద్ర మోడీ వైసీపీ పై అటాక్ చేయాలని సూచించినట్లు వార్తలు వచ్చాయి. కానీ ఏపీ బీజేపీ నేతల వైఖరి చూస్తుంటే మాత్రం అందుకు భిన్నంగా ఉంది.

బలం పెరిగినా..

ఏపీ బిజెపికిబలం పెరిగింది. ఓట్లతో పాటు సీట్లు పెరిగాయి. 8 అసెంబ్లీ సీట్లతో పాటు మూడు పార్లమెంట్ స్థానాలను సైతం కైవసం చేసుకుంది. ఒక కేంద్ర మంత్రి పదవి కూడా బిజెపికి ఉంది. రాష్ట్రంలో కూడా ఒక మంత్రి పదవి తీసుకుంది. కానీ ఏ ఒక్కరూ రాజకీయ ప్రకటనలు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఒక్క రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్ మాత్రమే మాట్లాడుతున్నారు. ఎన్నికలకు ముందు కూడా ఆయనే వైసీపీని టార్గెట్ చేసుకునేవారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం ఆయనను టార్గెట్ చేసుకునేది. అంతకుమించి పెద్దగా కనిపించేది కాదు. ఇప్పటికీ అదే సత్య కుమార్ యాదవ్ బిజెపి పై మాట్లాడుతున్నారు కానీ.. మరి ఏ ఇతర బిజెపి నేత ముందుకొచ్చి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేయడం లేదు. అసలు తెరవెనుక ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు.

అప్పట్లో వైసీపీకి అనుకూలం..

వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు బీజేపీలో ఒక వర్గం ఆ పార్టీకి అనుకూలంగా ఉండేది. అనుకూల ప్రకటనలు చేసేది. ఒకానొక దశలో టిడిపి తో పొత్తు వద్దు అని విభిన్న ప్రకటనలు చేసిన నేతలు ఉన్నారు. అటువంటి వారికి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కనీస ప్రాధాన్యం లేదు. నామినేటెడ్ పదవుల కేటాయింపు కూడా వారికి జరగలేదు. దీంతో వారు పార్టీలో సైతం అంటీ ముట్టనట్టుగా ఉన్నారు. అయితే ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలుగా ఎన్నికైన వారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేక వర్గం వారే. వారు సైతం నోరు తెరవడం లేదు. వారికి తెలుగుదేశం పార్టీ పట్ల అభిమానం ఉంటుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల ద్వేషం ఉంటుంది. అటువంటి వారు కూడా నోరు తెరవకపోవడం నిజంగా విశేషం. సాక్షాత్ ప్రధాని నరేంద్ర మోడీ వైసీపీని టార్గెట్ చేయాలని సూచించిన వారు నోరు తెరవకపోవడం అనేది నిజంగా విశేషమే.

# భారత్ ను బంగ్లాదేశ్ అందుకే రెచ్చగొడుతోందా?



ఢాకా, బంగాలదేశ్ రెండు రోజులుగా భగ్గుమంటోంది. ఏడాదిన్నర క్రితం రిజర్వేషన్ల విషయంలో జరిగిన అల్లర్ల కారణంగా ప్రధాని షేక్ హసీనా పదవి వీడి.. దేశం నుంచి పారిపోయారు. ఈ అల్లర్లతో బంగ్లాదేశ్‌లోని హిందువులు తీవ్రంగా నష్టపోయారు. ఇక తాజాగా విద్యార్థి నాయకుడు, భారత వ్యతిరేకి అయిన షరీఫ్ ఉస్మాన్ బిన్ హాదీ హత్యతో మరోమారు భగ్గుమంది. భారత్‌పై ఆరోపణలు చేస్తూ, హిందువులే లక్ష్యంగా దాడులు జరుగుతుఆన్నాయి. ఈ హింసలో ఒక హిందూ వ్యక్తి మృతిచెందాడు. ఆ దేశ అంతర్గత విషయాల్లో భారత్ జోక్యం లేకపోయినా వ్యతిరేక ధ్వనులు బలపడ్డాయి.

బంగాళాఖాతంలో పెరుగుతున్న టెన్షన్లు

కొన్ని నెలలుగా బంగ్లాదేశ్ చేపల బోట్లు భారత సముద్ర జలాల్లోకి వస్తున్నాయి. బంగ్లా నావికాదళం గస్తీలను డ్రామాటిక్‌గా పెంచింది, ఇది ఉద్దేశపూర్వకంగా చేస్తున్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ 15న జరిగిన ఘటనలో భారత బోటును బంగ్లా నావికాదళం ఢీకొట్టి 16 మంది మత్స్యకారులను సముద్రంలోకి తోసేసింది. ఇండియన్ కోస్ట్ గార్డ్ 11 మందిని కాపాడగా, మిగిలిన వారి గురించి ఇంకా సమాచారం లేదు.

ఎన్నికల నేపథ్యంలో అల్లర్లు..

వచ్చే ఫిబ్రవరిలో బంగాదేశ్‌లో జాతీయ ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో భారత వ్యతిరేక విధానాన్ని రొచ్చగొట్టి రాజకీయ లాభం పొందాలని మహ్మద్ యూనస్ ప్రభుత్వం చూస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత బంగ్లా బోట్లు భారత జలాల్లోకి ఎక్కువగా ప్రవేశించాయి. డిసెంబర్ 16న 35 మంది మత్స్యకారులు 500 కేజీల చేపలు పట్టుకున్నారు. అంతకుముందు 8 బోట్లు, 170 మందిని అరెస్టు చేశారు. యూనస్ 'ఈ ప్రాంత సముద్ర రక్షణ మా బాధ్యత' అని ప్రకటించిన తర్వాత ఇటువంటి చర్యలు తీవ్రమయ్యాయి.

పాక్, చైనా ప్రభావంతో భారత సవాలు

షేక్ హసీనా వెళ్లిపోయి యూనస్ అస్థిర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భారత%-బంగ్లా బంధాలు బలహీనపడ్డాయి. పాకిస్థాన్‌కు దగ్గరవుతూ బంగాళాఖాతంలో ప్రభావం పెంచుకుంటోంది. పార్లమెంటరీ కమిటీ 1971 యుద్ధానంతరం భారత్‌కు మరో సంక్షోభం ఎదురవుతోందని హెచ్చరించింది. మరోవైపు ఢాకాలో పాక్, చైనా ఆధిపత్యం పెరుగుతోంది. ఇది ప్రస్తుతానికి ఇబ్బంది లేకపోయినా భవిష్యత్‌లో బంగ్లాదేశ్‌కు కష్టాలు తప్పవు.

# సీఎం కుర్చీ వదలనంతే...కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

బెంగళూర్ :సగం లేదు ఏదీ లేదు...టర్మ్ పూర్తయ్యేదాకా నేనే సీఎం...ఆ సీటు నాది అంటూ కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తాజాగా అసెంబ్లీ సాక్షిగా సంచలన వ్యాఖ్యలు చేశారు. కర్ణాటక ముఖ్యమంత్రి పదవి వివాదం ఇంకా రగులుతునే ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినపుడు సీఎం సీటు పవర్ షేరింగ్ ప్రకారం ఉంటుందని. రెండున్నరేళ్లు సిద్ధరామయ్య...మరో రెండున్నరేళ్లు డీకే శివకుమార్ అని ఈమేరకు అధిష్టానం వద్ద ఒప్పందం కుదిరిందని వార్తలు వినవచ్చాయి. అనుకున్నట్లుగానే సిద్ధరామయ్య సీఎం అయ్యారు. డీకే డిప్యూటీ సీఎం అయ్యారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ పాలనా కాలం సగం పూర్తికాగానే అసలు కథ షురూ అయ్యింది. డీకే నేరుగా మాట్లాడకపోయినా తన అనుచరగణాలను ఉసిగొలిపి...సిద్ధరామయ్య దిగిపోవాలి అనిపిస్తునే ఉన్నారని వార్తలు వినవస్తున్నాయి. మొదట్లో సిద్ధరామయ్య పెద్దగా పట్టించుకోలేక పోయినా ఆ తర్వాత తను గొంతు వినిపించాల్సిన ఆగత్యం వచ్చింది. ఇపుడు నేరుగా అలాంటిదేం లేదు అయిదేళ్ళు నేనే సీఎం అని ఢంకా బజాయించి మరీ చెబుతున్నారు. ఈ ప్రకటనలు మరింత రాజకీయ జగడానికి కారణాలవుతున్నాయి.మొన్నటిమొన్న బెళగావిలో అసెంబ్లీ శీతాకాల సమావేశంలో ఉత్తర కర్ణాటకాభివృద్ధి గురించి మాట్లాడుతున్న సందర్భంలో సీఎం సిద్ధరామయ్య ...తను రెండున్నరేళ్ళ ముఖ్యమంత్రి అని ఎప్పుడూ చెప్పలేదని అన్నారు. అధిష్టానం ఆశీస్సులతో అయిదేళ్ళు సీఎం కుర్చీలోనే కొనసాగుతానని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష బీజేపీ నేతలు ఉత్తర కర్ణాటక అబివృద్ధి మీ హయాంలో జరుగుతుందా? అసలే వ్యవధి పూర్తవుతున్నట్లుంది అన్న వాదనకు ప్రతిస్పందిస్తూ సిద్ధరామయ్య నేను అయిదేళ్ళు సీఎం గా ఉండేందుకు అధిష్టానం మొగ్గుచూపుతోందన్నారు. బీజేపీ నేత సునిల్ కుమార్ సిద్ధరామయ్య భవితవ్యం గురించి ప్రశ్నించగా...ఇపుడు నేను సీఎంని హైకమాండ్ ఆదేశిస్తే అయిదేళ్ళు సీఎంగానే ఉంటా అని ధీమా వ్యక్తం చేశారు. అయితే బీజేపీ నేత పదే పదే పవర్ షేరింగ్ గురించి ప్రస్తావిస్తుండటంతో...తను ఎప్పుడూ రెండున్నరేళ్ళే సీఎం గా ఉంటానని అనలేదని స్పష్టం చేశారు. ఇదే సమయంలో మీ నేత యడ్యూరప్ప పూర్తికాలం ఉంటానని చెప్పినా దిగిపోయారు అని వ్యంగ్యంగా అన్నారు సిద్ధరామయ్య. మళ్లీ అదే విషయాన్ని బీజేపీ నేతలు అంటుండటంతో ...మాకు ఎవరి డైరెక్షన్ అక్కర్లేదు...మేమే ప్రొడ్యూసర్లం, యాక్టర్లం, డైరెక్టర్లం. మీకు మాత్రం డైరెక్టర్ ఉన్నారని అన్నారు.కర్ణాటకలో ఈ పవర్ షేరింగ్ తలనొప్పి ప్రారంభం నుంచే ఉంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇద్దరు నేతలు నేనంటే నేనంటూ సీఎం సీటు కోసం పోటీపడిన మాట వాస్తవం. ఉపముఖ్యమంత్రి డీకేశివకుమార్...ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాక, సీఎం సీటు తనకు దక్కాల్సిందే అని పట్టుబట్టినా...సిద్ధరామయ్య



వ్యూహాత్మకంగా పావులు కదిపి తను ఆ సీటులో కూర్చోగలిగారు. అయితే అప్పట్లో ఇదో వివాదంగా మారింది. అసలు సిద్ధరామయ్యకు సీఎం పదవి ఇవ్వడానికి కాంగ్రెస్ అధిష్టానం అంగీకరించడంలో అంతర్గత ఆలోచన చాలానే ఉందన్నది అప్పటి ప్రచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన వెనువెంటనే ఎంపీ ఎన్నికలు ముంచుకు రావడంతో...తనను సీఎం చేస్తే అధిక సంఖ్యలో ఎంపీలను తీసుకు వస్తానని సిద్ధరామయ్య అధిష్టానంతో అన్నారని, అందుకే అధిష్టానం కూడా సిద్ధరామయ్య వైపే మొగ్గు చూపిందని వార్తలు గుప్పుమన్నాయి.ఆ తర్వాత ఈ వివాదం కాస్త సద్దుమణిగినా...దసరా సంరంభం ముగిసిన వెంటనే మరోసారి పవర్ షేరింగ్ వివాదం తెరపైకి వచ్చింది. అక్టోబర్ తో రెండున్నరేళ్ళ పాలన కాలం ముగిసిపోవడంతో ఇక డీకే సీఎం అవుతారని అతని అనుచరులు ప్రచారం ప్రారంభించారు. అయితే అదేం కాదు అయిదేళ్ళపాటు నేనే సీఎం అని సిద్ధరామయ్య అంటే ఆయన చెప్పిందే ఫైనల్ అని డీకే స్పందించారు. మరోవైపు బీజేపీ బిహార్ ఎన్నికలు ముగిసిన వెంటేనే పవర్ షేరింగ్ పక్కా అని కాంగ్రెస్సే ప్రచారం ప్రారంభించిందని సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. దీనికి డీకే మొదట బీజేపీ తమ ఆంతరంగిక సమస్యల్ని చక్కదిద్దుకుంటే మంచిదని ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. ఇపుడు నేరుగా అసెంబ్లీలోనే పవర్ షేరింగ్ టాపిక్ హాట్ టాపిక్ గా మారింది.మరోవైపు ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పవర్ షేరింగ్ వాదాన్ని ఖండించలేదు. ఎన్నికల సమయంలో ఒప్పందం ఉండిందనే అంటున్నారు. కాకపోతే సీఎం సిద్ధరామయ్య తాను అవగాహనతో ఉన్నామని...అధిష్టానం మాటకు కట్టుబడి ఉంటామని ప్రకటించారు. ఈ వివాదానికి ఇంతటితో ఫుల్ స్టాప్ పడుతుందా..లేదా మరో రెండున్నరేళ్ళపాటు ఇలాగే కొనసాగుతుందా అంటే చెప్పలేని పరిస్థితి. పవర్ షేరింగ్ మాట ఎలా ఉన్నా..ప్రతిపక్ష బీజేపీకి మాత్రం అవసరం వచ్చినప్పుడల్లా వాడుకునే బ్రహ్మాస్త్రంగా మారిందన్నది సత్యం.

# 'ఆళ్లు రెండూ కానోళ్లా?'.. కేటీఆర్ సవాల్..కాంగ్రెస్ పార్టీలో కల్లోలం..



హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో పార్టీ మార్పులు కొత్తవి కావు. కానీ ఇటీవలి పంచాయతీ ఎన్నికల తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు మాత్రం ఈ అంశాన్ని మరింత ఉద్రిక్తంగా మార్చాయి. అధికార పార్టీ కాంగ్రెస్ విజయాన్ని తన భవిష్యత్తు రాజకీయ ఆధిపత్యానికి సంకేతంగా చిత్రీకరిస్తుంటే.., ప్రతిపక్ష బీఆర్ఎస్ ఆ విజయంలోని వాస్తవాలపై ప్రశ్నలు సంధిస్తోంది. ఈ నేపథ్యమే తాజాగా తెలంగాణ రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించింది.

చర్చకు దారి తీసిన సీఎం వ్యాఖ్యలు..

పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించిందని, ప్రజలు తమ వెంటే ఉన్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద చర్చకు దారితీశాయి. ఈ విజయం 2029 వరకూ కొనసాగుతుందని ఆయన ధీమాగా చెప్పడం.., అధికార పక్షంలో ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించినా.. అదే సమయంలో ప్రతిపక్షాన్ని రెచ్చగొట్టింది. ఈ వ్యాఖ్యలను కోట్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన సవాల్ విసిరారు. 'దమ్ము, ధైర్యం ఉంటే పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించండి. ఉప ఎన్నికలకు వెళ్దాం' అంటూ సీఎం రేవంత్ రెడ్డిని నేరుగా ప్రశ్నించారు.

ప్రతి సవాల్ విసిరిన కేటీఆర్

ఈ సవాల్‌లోని రాజకీయ పదునే ఇప్పుడు అసలు చర్చకు కేంద్రబిందువుగా మారింది. ఎందుకంటే, పార్టీ మారిన ఎమ్మెల్యేల అంశం తెలంగాణలో ప్రజాస్వామ్య విలువలపై ఎప్పటి నుంచో ఉన్న సందేహాలను మళ్లీ బయటకు తీసుకొచ్చింది. ప్రజలు ఓటేసి గెలిపించిన ప్రతినిధులు, మధ్యలో పార్టీ మారితే.. వారి అసలు ప్రతినిధిత్వం ఎవరిది? ఓటర్లదా? లేక అధికార, పదవుల లెక్కలదా? అనే ప్రశ్నలు సహజంగానే తలెత్తుతున్నాయి.సిరిసిల్ల పర్యటనలో మాట్లాడిన కేటీఆర్, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'ప్రపంచం మొత్తం కోడై కూస్తుంటే, స్పీకర్‌కు తెలియదా?' అంటూ శాసనసభ స్పీకర్ వైఖరిపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి ఈ పరిణామాలను గమనించకపోవడం ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. కొందరు ఎమ్మెల్యేలు స్వయంగా 'పార్టీ మారాం' అని చెబుతున్నా.. వాటిపై చర్యలు ఎందుకు లేవన్నది బీఆర్ఎస్ ప్రధాన ఆరోపణ.

రాజకీయ నైతికతపై చర్చ..

ఇక్కడే రాజకీయ నైతికతపై అసలు చర్చ మొదలవుతుంది. ప్రజలు ఇచ్చిన ఓటు ఒక పార్టీకి, ఒక సిద్ధాంతానికి. కానీ ఆ ఓటుతో గెలిచిన వ్యక్తి మరో పార్టీకి మారితే, ఆ ఓటు విలువ ఏమవుతుంది? ఇదే అంశాన్ని కేటీఆర్ తన పదునైన వ్యాఖ్యలతో ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. 'ఆళ్లు రెండూ కానోళ్లా?' అన్న వ్యాఖ్యలు రాజకీయంగా వివాదాస్పదమైనా, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై ఉన్న ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తున్నాయన్న వాదన వినిపిస్తోంది.కాంగ్రెస్‌కు ఇది ఆందోళనకర పరిస్థితి. ఒకవైపు అధికారంలో ఉన్న పార్టీగా ప్రజల మద్దతు ఉందని చెప్పుకుంటూనే, మరోవైపు పార్టీ మారిన ఎమ్మెల్యేలపై రాజీనామాలు కోరే సవాల్‌ను ఎదుర్కోవాల్సి వస్తోంది. నిజంగా ప్రజలు కాంగ్రెస్ వెంటే ఉన్నారనుకుంటే, ఉప ఎన్నికలకు వెళ్లడంలో ఇబ్బంది ఏమిటన్న ప్రశ్న ప్రతిపక్షం లేవనెత్తుతోంది. అదే సమయంలో, అధికార పార్టీ మాత్రం పంచాయతీ ఎన్నికల ఫలితాలను ప్రజాభిప్రాయానికి తుది ముద్రగా చూపించే ప్రయత్నం చేస్తోంది.

సీఎం సవాల్ స్వీకరిస్తారా?

ఈ రాజకీయ యుద్ధం చివరికి తీసుకెళ్లేది ఎక్కడికి..? ఉప ఎన్నికల సవాల్‌ను కాంగ్రెస్ స్వీకరిస్తుందా..? లేక సంఖ్యాబలమే రాజకీయ న్యాయమని నిరూపించుకునే దిశగా సాగుతుందా..? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది. ఒక విషయం మాత్రం స్పష్టం.. పార్టీ మారిన ఎమ్మెల్యేల అంశం తెలంగాణ రాజకీయాల్లో దీర్ఘకాల ప్రభావం చూపనుంది.ప్రజాస్వామ్యంలో సంఖ్యలు ముఖ్యం. కానీ నైతికత మరింత ముఖ్యం. ఓటు విలువను కాపాడే రాజకీయ సంస్కృతి లేకపోతే, ప్రజల విశ్వాసమే నశిస్తుంది. "పార్టీ మారినోళ్లు రెండూ కానోళ్లా?" అన్న ప్రశ్న వెనుక ఉన్న ఆవేదన, అసలు రాజకీయ వ్యవస్థపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తికి ప్రతిబింబం. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఇక రాజకీయ పార్టీలదే.

# విదేశీ ఉత్పత్తులపై భారత్ వివక్ష చూపుతోంది..



న్యూఢిల్లీ,అంతర్జాతీయ వాణిజ్య రంగంలో భారత్-చైనాల మధ్య ఉన్న ఉద్రిక్తతలు మరోసారి బహిరంగంగా వెలుగులోకి వచ్చాయి. ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఉత్పత్తులపై భారత్ విధిస్తున్న సుంకాలు, అలాగే సోలార్ రంగానికి అందిస్తున్న సబ్సిడీలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ చైనా ప్రపంచ వాణిజ్య సంస్థలో ఫిర్యాదు చేసింది.ఈ ఏడాది భారత్‌పై చైనా WTOలో ఫిర్యాదు చేయడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఈ ఫిర్యాదుతో ఆసియాలోని రెండూ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య విభేదాలు మరింత ముదిరినట్లుగా కనిపిస్తున్నాయి.చైనా ఆరోపణలు ఏమిటి?: చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. భారత్ అమలు చేస్తున్న కొన్ని విధానాలు WTO నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని బీజింగ్ ఆరోపిస్తోంది. ముఖ్యంగా నేషనల్ ట్రీట్‌మెంట్ సూత్రాన్ని భారత్ ఉల్లంఘిస్తోందని చైనా వాదిస్తోంది. అంటే దేశీయ ఉత్పత్తులకు అనుకూలంగా, విదేశీ ఉత్పత్తులపై వివక్ష చూపే విధానాలు భారత్ అనుసరిస్తోందని దీని అర్థం.అదే విధంగా.. దిగుమతి ప్రత్యామ్నాయాన్ని ప్రోత్సహించే రాయితీలు WTO నియమాల ప్రకారం నిషేధించబడ్డవని చైనా పేర్కొంది. సోలార్ ప్యానెల్స్, మాడ్యూళ్లు వంటి రంగాల్లో భారత కంపెనీలకు సబ్సిడీలు ఇచ్చి, విదేశీ కంపెనీలకు పోటీ అవకాశాలను తగ్గిస్తోందని వాదించింది. ఈ విధానాలు చైనా కంపెనీల వ్యాపార ప్రయోజనాలను నష్టపరుస్తున్నాయని, భారత తయారీదారులకు అన్యాయమైన పోటీ ప్రయోజనం కలుగుతోందని స్పష్టం చేసింది. అందుకే ఈ రాయితీలను వెంటనే ఉపసంహరించుకోవాలని లేదా WTO నిబంధనలకు అనుగుణంగా సవరించాలని భారత్‌ను కోరింది.భారత్ వైఖరి ఏమిటి?: ఈ అంశంపై భారత వాణిజ్య మంత్రిత్వ శాఖ ఇంకా ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. అయితే, పరిణామాలపై అవగాహన ఉన్న అధికార వర్గాల సమాచారం ప్రకారం.. ఇలాంటి ఫిర్యాదులు అంతర్జాతీయ వాణిజ్యంలో సాధారణమేనని వారు అభిప్రాయపడుతున్నారు. దేశీయ పరిశ్రమలను బలోపేతం చేయడం, స్వయం సమృద్ధి లక్ష్యాన్ని సాధించడం కోసం కొన్ని కీలక రంగాలకు ప్రోత్సాహకాలు అవసరమని భారత్ భావిస్తోంది.పునరుత్పాదక ఇంధనం, ఐటీ హార్డ్‌వేర్, హైటెక్ తయారీ వంటి రంగాల్లో భారత్ ప్రవేశపెట్టిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాలు తయారీ సామర్థ్యాన్ని పెంచడానికేనని నిపుణులు చెబుతున్నారు. ఇవి పూర్తిగా WTO నిబంధనల పరిధిలోనే ఉన్నాయని భారత్ తరఫు వాదనగా తెలుస్తోంది. అయితే ఇది కొత్త వివాదమేమి కాదు. గత అక్టోబర్‌లో కూడా ఎలక్ట్రిక్ వాహనాలు ), బ్యాటరీ తయారీ రంగాల్లో భారత్ ఇస్తున్న సబ్సిడీలపై చైనా WTOలో ఫిర్యాదు చేసింది. గ్రీన్ ఎనర్జీ, క్లీన్టెక్, హైటెక్ తయారీ రంగాల్లో ప్రపంచ ఆధిపత్యం కోసం జరుగుతున్న పోటీ నేపథ్యంలోనే ఈ చర్యలను చైనా చేపడుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ప్రస్తుతం WTO ప్రక్రియ ప్రకారం.. ముందుగా భారత్-చైనా మధ్య సంప్రదింపులు జరగాలి. ఒకవేళ ఆ చర్చలు విఫలమైతే.. WTO వివాద పరిష్కార కమిటీ ఈ అంశాన్ని విచారిస్తుంది. ఈ వివాదం ఫలితం భవిష్యత్తులో భారత్ అమలు చేసే పారిశ్రామిక విధానాలు, గ్రీన్ ఎనర్జీ వ్యూహాలపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశముందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

# హైదరాబాద్ లో చౌకగా ఇళ్ళు... బంపర్ ఆఫర్ !

హైదరాబాద్,హైదరాబాద్ అంటే దక్షిణ భారత దేశంలోనే అతి ముఖ్య ప్రాంతం. అక్కడ కోటి కి పైగా జనాభా ఉంది. హైదరాబాద్ లో ఉంటే చాలు అనుకునే వారే అత్యధిక శాతం ఉంటారు. ఇక సొంత ఇళ్ళు ఎంతమందికి ఉన్నాయంటే వేరే స్టోరీ. కానీ సొంత ఇల్లు తమకు ఉండాలని సగటు మనిషికి కోరిక. అలాంటిది భాగ్యనగరంలో ఇళ్ళు అయితే అతి చౌకగా ఇస్తున్నారు. అది కూడా ఎంతో కీలకమైన ప్రాంతంలో. మరి ఎందుకు ఆలస్యం. అది అమృతం విషం అంటున్నారు. ఇంతకీ ఆ బంపర్ ఆఫర్ ఏమిటి ఏమా కథా అన్నదే ఇంట్రెస్టింగ్ పాయింట్.

మిడిల్ క్లాస్ కి అందుబాటులో :

హైదరాబాద్ లో అద్దెలు చాలా చోట్ల ఎక్కువగా ఉంటాయి. ప్రైమ్ ఏరియాలో అయితే ఇంకా బాదుడు ఉంటుంది. అలాంటిది గచ్చీ బౌలి లాంటి ప్రాంతంలో సింగిల్ బెడ్ రూంలను తక్కువ రేట్లకే అమ్మకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం గేట్లు తెరచింది. ఈ సింగిల్ బెడ్ రూం ఇళ్ళను తెలంగాణా హౌసింగ్ బోర్డు నిర్మాణం చేసింది. వీటిని ఈ వేలం ద్వారా అమ్మడానికి సిద్ధం అయింది. అయితే ఈ సింగిల్ బెడ్ రేట్లు ఇపుడు చర్చగా మారాయి. కేవలం ఇరవై ఆరు లక్షల రూపాయల నుంచి 35 లక్షల రూపాయల దాకా ఉన్నాయి. అయితే వీటి ఎస్ ఎఫ్ టీ చూస్తే కనుక 500 నుంచి 600 పై దాకా ఉన్నాయి. హాయిగా ఇద్దరు చిన్న పిల్లలతో కాపురం ఉండేవారికి ఈ ఇళ్ళు చాలా చక్కటి సదుపాయంగా ఉంటాయని అంటున్నారు.

వారి కోసమే మరి :

భాగ్యనగరంలో ఉద్యోగం చేస్తూ నెలకు ఒక యాభై వేల రూపాయల దాకా ఆదాయం తెచ్చుకున్న వారు అంతా మిడిల్ క్లాస్ గానే ఉంటారు. వీరి ఇంటి ఖర్చులు పోనూ నెలవారీ ఆదాయంలో ఎంతో కొంత మిగుల్చుని చిన్న పాటి జాగా అయిన కొనుక్కోవాలని చూస్తారు. అలాంటి వారికి ఈ ఇళ్ళు ఎంతో ఉపయోగగంగా ఉంటాయని అంటున్నారు. ఎందుకంటే ఇంటద్దకే జీతంలో పావు వంతుకు పైగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంటోంది. అది కూడా గచ్చీ బౌలీ లాంటి చోట్ల చిన్న ఇల్లు అయినా పెద్ద ఆస్తిగానే చూడాల్సి ఉందని చెబుతున్నారు. ఈ రోజున ఈ ఇళ్ళను కొనుగోలు చేసి పెట్టుకున్నా ఫ్యూచర్ లో ఈ ఇళ్ళే కోటికి పైగా పడగలెత్తే అవకాశాలు ఉంటాయని అంటున్నారు.యాభై వేల లోపు ఆదాయం ఉన్న వారే ఈ ఇళ్ళను పొందేందుకు అర్హులని కూడా హౌసింగ్



బోర్డు స్పష్టంగా పేర్కొంది. గచ్చిబౌలిలో ఏకంగా 111 దాకా ఈ తరహా ఫ్లాంట్లను విక్రయించడం జరుగుతోంది. అంతే కాదు ఇదే విధంగా వరంగల్ లో మరో వంద దాకా ఖమ్మంలో నూటా పాతిక దాకా ఫ్లాట్లు హౌసింగ్ బోర్డువే ఉన్నాయి. వీటిని కూడా అక్కడ మార్కెట్ ధరలను దృష్టిలో ఉంచుకుని హౌసింగ్ బోర్డు తక్కువ ధరలకే విక్రయిస్తోంది. ఇక ఖమ్మంలో అయితే సింగిల్ బెడ్ రూం చూస్తే ఏకంగా 11 లక్షలకే దొరుకుతోంది అంటే సూపర్ అనాల్సిందే. వరంగల్ లో అక్కడ ఉన్న మార్కెట్ రేటుని దృష్టిలో ఉంచాని 20 లక్షల దాకా వీటి రేటు పెట్టారు. మొత్తానికి ఈ గోల్డెన్ చాన్స్ ని మిడిల్ క్లాస్ అయితే మిస్ చేసుకోకూడదనే అంటున్నారు. ఇతర వివరాలు కావాల్సిన వారు వెబ్ సైట్ లోకి వెళ్ళి అన్నీ చూడాల్సి ఉంది.

## శ్రీశైలంలో అన్యమతం అపచారం

శ్రీశైలం,ప్రసిద్ధి పుణ్యక్షేత్రం శ్రీశైలం శ్రీ భ్రమరాంబమల్లికార్జున స్వామి దేవాలయంలో అన్యమత ప్రార్థనలు, బోధనలు, రీల్స్ చేయడంపై దేవస్థానం కఠిన ఆంక్షలు విధించింది. దేవాలయంలో ఇలాంటివి చేయడం నేరమని.. చట్టరీత్యా చర్యలు తప్పవి దేవస్థానం ఈవో శ్రీనివాస్ రావు హెచ్చరించారు. శ్రీశైలం క్షేత్ర పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా అన్యమత ప్రార్ధనలు చేయటం, ప్రచారాలు నిర్వహించటం నిషేధమని తెలిపారు. అన్యమత బోధనలకు సంబంధించిన కరపత్రాలను, పుస్తకాలను పంచటం, అన్యమతాలకు సంబంధించిన కార్యకలాపాలను నిర్వహించటం చట్టరీత్యా నేరమని అన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com